




https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY








సంపుటి 10 | సంచిక 312 | కర్నూలు | శుక్రవారం డిసెంబర్ 12 2025 | పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi






అమరావతి,డిసెంబర్ 11(శ్రీచక్ర) : ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపైచర్చించి..నిర్ణయం తీసు కున్నారు. దాదాపు 44 అజెండా అం శాలతో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది.రూ.9,500 కోట్లతో 506 ప్రాజెక్టులకు పరిపాలన అనుమతు లకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో సమగ్ర నీటి నిర్వహణకు సంబంధిం చిన ప్రాజెక్టులు, అమరావతిలో లోక్ భవన్, అసెంబ్లీ దర్బార్ హాల్ నిర్మా ణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అదే విధంగా గవర్నర్ కార్యాలయం, గెస్ట్ హౌస్‌లు, స్టాఫ్ క్వార్టర్ల నిర్మా ణానికి మంత్రివర్గ సమావేశంలో చర్చించిఅంగీకారంతెలిపారు. అలా గే పలు సంస్థలకు భూ కేటాయింపు లకు కేబినెట్ అనుమతి ఇచ్చింది.**కీలక నిర్ణయాలు ఇవే..**సీడ్ యాక్సెస్ రహదారిని 16వ హైవేకి అనుసంధాన పనులకు రూ.532 కోట్లకు కేబినెట్ ఆమోదం.కుప్పంలో పాలేరు నదిపై చెక్‌డ్యామ్‌ల నిర్వహణకు పరిపాలన అనుమతుల మంజూరుకు ఓకే

గిరిజన సంక్షేమశాఖలో 417 భాషా పండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతికి గ్రీన్ సిగ్నల్

ఆంధ్రప్రదేశ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ ముసాయిదా బిల్లుపై కేబినెట్‌లో చర్చ, ఆమోదం

ఎస్ఐపీబీలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలకు ఆమోదం రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశ నిర్ణయాలకు ఆమోదం రూ.20 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 26 సంస్థలకు ఏపీ కేబినెట్ ఆమోదం


# దేశంలో మొదటి క్వాంటం కంప్యూటర్ అమరావతిలోనే..



అమరావతి, డిసెంబర్ 11:(శ్రీచక్ర) 44 అంశాలపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించి ఆమోదం తెలిపిందని మంత్రి పార్ధసారది తెలిపారు. ఏపీ కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను మంత్రి మీడియాకు వెల్లడించారు. అమృత్ 2 లో భాగంగా 2026 మార్చి 31 కల్లా పెండింగ్ పనులు ప్రారంభించాలని కేంద్రం స్పష్టం చేసిందని.. అమృత్ 2లో భాగంగా 506 పెండింగ్ ప్రాజెక్టులను రూ.9,613 కోట్ల నిధులతో చేపట్టేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. రూ.163 కోట్లతో అమరావతిలో లోక్ భవన్ నిర్మాణానికి టెండర్లు పిలిచే ప్రతిపాదనలకు ఆమోదం లభించిందన్నారు. ఎల్ 1 బిడ్లను ఆమోదించే బాధ్యతను సీఆర్డీఏ కమిషనర్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అమరావతిలో ఇ 3 రోడ్డు విస్తరణకు ఎల్ 1 బిడ్ ఆమోదానికి అమరావతి డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఎండీకి బాధ్యతలు అప్పగించామన్నారు.చిత్తూరు జిల్లా కుప్పంలో పలార్ నదిపై చెక్ డ్యాం నిర్మాణానికి రూ.15.96 కోట్ల నిధులను పెంచే ప్రతిపాదనకు ఆమోదం లభించిందన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 417 టీచర్ పోస్టులను అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. సాంఘిక సంక్షేమం విభాగంలో సామాజిక సేవలో అనుభవం ఉన్న వ్యక్తులను చైర్మన్లు, మెంబర్లుగా నియమించే ప్రతిపాదనకు కేబినెట్ ఓకే చెప్పిందన్నారు. దేశంలో తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా కీలక ప్రతిపాదనకు ఆమోదం తెలిపామని చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్‌లో రూ.1421 కోట్ల రూపాయల పెట్టుబడులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. 3057 మందికి క్వాంటం అప్లికే షన్స్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం చెప్పిందని అన్నారు. క్వాంటం కంప్యూటింగ్ విభాగంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన 11 సంస్థల ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ ఆమోద ముద్ర వేసిందని మంత్రి పార్ధసారథి తెలిపారు.క్వాం టం కంప్యూటర్లు తయారు చేయడం కోసం ముందుకు వచ్చిన పలు సంస్థల ప్రతిపాదనలకు, అలాగే క్వాంటం కంప్యూటింగ్ లో శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వచ్చిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. ఇటీవల ఎస్ఐపీబీ సమావేశంలో తీసుకున్న పలు పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 సంస్థలకు సంబంధించి 20267 కోట్ల రూపాయల పెట్టుబడులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెంచడాన్ని సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. విద్యుత్ చార్జీలను రూ. 5.12 నుంచి 4 రూపాయలకు తీసుకురావాలన్నది సీఎం లక్ష్యమని చెప్పారు. దీని కోసం రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం పలు సంస్థల ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించిందన్నారు.కృష్ణపట్నం పోర్టులో 4731 ఎకరాలు మల్టీ ప్రాడక్ట్ సెజ్ ఏర్పాటు కోసం 2010లో ల్యాండ్ కొనుక్కున్నారని.. అక్టోబర్ 2019లో గత ప్రభుత్వం ఈ భూ కేటాయింపులను రద్దు చేసిందన్నారు. దీన్ని కోర్టు కొట్టి వేయడం వల్ల ప్రాజెక్టు పదేళ్ల ఆలస్యమైనందున పెనాల్టీని రద్దు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. 3 ఏళ్లలో తొలిదశ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించాలని సమయం ఇస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మహిళల ప్రపంచ కప్ గెలుపులో విశేష ప్రతిభ చూపిన రాష్ట్ర క్రీడాకారిణి శ్రీ చరణికి ప్రోత్సాహకం ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామన్నారు. శ్రీ చణికి రూ.2.5 కోట్ల నగదు, విశాఖపట్నంలో 500 గజాలు ఇంటి స్థలం ఇవ్వాలని నిర్ణయించినట్లు పార్ధసారథి చెప్పారు.గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక గ్రూప్ 1 ఉద్యోగం ఇచ్చే ప్రతిపాదనకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. పీఎం సూర్యఘర్ కింద ఇంటిపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకునే బీసీలకు అదనంగా సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. కేంద్రం ఇచ్చే సబ్సిడీకి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల అదనపు సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగం కలిన బీసీ వినియోగదారులకు రూ.20 వేల సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. రూ.5445 కోట్ల అంచనా బడ్జెట్‌తో పీఎం సూర్యఘర్ ప్రాజెక్టును రాష్ట్రంలో అమలు చేయాలని మంత్రివర్గంలో నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు.రాష్ట్రంలో రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్ విషయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు సీఎం తెలిపారన్నారు. ఏడాది కాలంలోనే రెవెన్యూ సమస్యలన్నింటినీ పూర్తిగా పరిష్కరించాలని రెవెన్యూ విభాగాన్ని సీఎం ఆదేశించారని తెలిపారు.

# అనంతపురంలో దారుణం..

## విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం



అనంతపురం, డిసెంబరు11:(శ్రీచక్ర) అనంతపురం జిల్లాలోని కేఎస్ఆర్ జూనియర్ కాలేజీలో నలుగురు బాలికలు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నలుగురు విద్యార్థినులు వాస్మోల్ తాగి ఆత్మహత్యయత్నం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. నగరంలోని కేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో తాడిపత్రి మండలానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన అక్కాచెల్లెళ్లు చదువుతున్నారు.విద్యార్థినుల గురించి తల్లిదండ్రులకు వార్డెన్ వసంత ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థినులు భయపడి ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం గమనించిన వార్డెన్ వెంటనే వారిని చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఎమర్జెన్సీ వార్డులో చికిత్స అందిస్తున్నారు వైద్యులు. ప్రస్తుతం బాలికల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.ఈ విషయం తెలుసుకుని ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు విద్యార్థినుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు చేరుకున్నారు. బాలికల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అయితే, ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను వెల్లడించేందుకు నిరాకరిస్తున్నారు కుటుంబ సభ్యులు. ఈ ఘటనతో మిగతా విద్యార్థినులు కూడా తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు





దేశంలో ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అతి వేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అనుభవం లేకుండా క్లీనర్లు వాహనాలు నడపడం ఇలా ఎన్నో కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా అరుణాచల్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఇండో - చైనా సరిహద్దు వెంబడి ఉన్న హయులియాంగ్ - చగ్లగామ్ రహదారిపై ఈ ఘటన జరిగింది. అస్సోంలోని టిన్సుకియా జిల్లాకు చెందిన రోజు వారి కూలీలను తీసుకువెళ్తున్న ఓ ట్రక్కు మార్గమధ్యలో ఈ ప్రమాదానికి గురైనట్లు తెలుస్తుంది. ఈ ప్రమాదంలో ట్రక్కులో ఉన్న 22 మంది కూలీలు చనిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు.వాస్తవానికి ఈ ఘటన సోమవారం అంటే మూడు రోజుల క్రితం జరిగింది. ఈ ప్రమాదం నుంచి ఓ కార్మికుడు గాయాలతో బయటపడి పట్టణానికి చేరుకున్నాడు. అతడు ఇచ్చిన సమాచారం వల్లనే ఈ విషాద ఘటన గురించి పోలీసులకు తెలిసింది. గాయపడ్డ ఆ కార్మికుడి మెరుగైన చికిత్స కోసం అస్సాంకు తరలించారు. ప్రమాద ఘటన గురించి అంజావ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ మిల్లో కొజిన్ ధృవీకరించారు.ఈ ప్రమాదంపై మాట్లాడుతూ.. ఈ ఘటన అంతర్జాతీయ సరిహద్దుకు 45 కిలోమీటర్ల దూరంలో, సముద్ర మట్టానికి దాదాపు 10 వేల అడుగుల ఎత్తులో ఉందన్నారు. ఇప్పటి వరకు 17 మృతదేహాలను వెలికి తీసినట్లు తెలిపారు. రెస్క్యూ టీమ్ సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మిలో కొజిన్ వెల్లడించారు.

# లోక్‌సభలో ఈ- సిగరెట్ దుమారం

## అనురాగ్ ఠాకూర్ ప్రస్తావన..స్పీకర్ ఆగ్రహం

న్యూఢిల్లీ,డిసెంబర్11 (శ్రీచక్ర) : పార్లమెంట్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ ఎంపీ.. సభా పరిసరాల్లోనే ఈ-సిగరేట్ తాగినట్లు బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ఆరోపించారు. లోక్‌సభలో ఆయన ఈ విషయాన్ని స్పీకర్ ఓం బిర్లా ముందు ప్రస్తావించారు. అయితే ఆ ఈ-సిగరేట్ తాగిన వ్యక్తిపై చర్యలు తీసుకోనున్నట్లు స్పీకర్ బిర్లా పేర్కొన్నారు. ఇలా ఎవరు చేసినా సహించేది లేదన్నారు. ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రశ్నోత్తరాల సమయంలో సప్లిమెంటరీ అడిగిన సమయంలో బీజేపీ ఎంపీ ఆ విషయాన్ని గుర్తు చేశారు. సభలో ఈ-సిగరెట్లకు అనుమతి ఉందా అని ఎంపీ అనురాగ్.. స్పీకర్ బిర్లాను అడిగారు. లేదు అని ఆయన సమాధానం ఇచ్చారు. అయితే గత కొన్ని రోజుల నుంచి టీఎంసీ ఎంపీ సభలో ఈ-సిగరేట్ తాగుతున్నట్లు ఎంపీ ఠాకూర్ ఆరోపించారు. ఆ ప్రతిపక్ష ఎంపీపై చర్యలు తీసుకోవాలని అనేకమంది బీజేపీ సభ్యులు డిమాండ్ చేశారు. భారీగా నినాదాలు రావడంతో.. సభ్యుల్ని స్పీకర్ బిర్లా శాంతపరిచారు. హుందాగా వ్యవహరించాలన్నారు.ఒకవేళ ఏదైనా లిఖితపూర్వక ఫిర్యాదు నమోదు చేస్తే, అప్పుగు ఆ ఎంపీపై చర్యలు తీసుకుంటానన్నారు.

# ఏపీలో చంద్రబాబు పాలనపై మోదీ కితాబు



న్యూఢిల్లీ, డిసెంబర్ 11(శ్రీచక్ర) : ఏపీలో పాలనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. చంద్రబాబు పాలన భేష్ అంటూ కితాబిచ్చారు. ఈరోజు (గురువారం) ఉదయం ఏపీ , తెలంగాణ ఎన్డీయే ఎంపీలతో కలిసి ప్రధాని మోదీ అల్పాహార విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీలో చంద్రబాబు పాలన చాలా బావుందని ప్రశంసించారు. పెట్టుబడులు కూడా ఏపీకి ఎక్కువగా వస్తున్నాయని ప్రధాని వెల్లడించారు. అయితే ఏపీలో పాలనను పొగడ్తలతో ముంచెత్తిన ప్రధాని.. తెలంగాణ బీజేపీ ఎంపీలపై మాత్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో సరైన ప్రతిపక్ష పాత్ర పోషించలేకపోతున్నారని ఫైర్ అయినట్లు సమాచారం. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండాలని ఎంపీలకు ప్రధాని మోదీ హితవుపలికారు.ఈరోజు ఉదయం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎంపీలకు ప్రధాని మోదీ అల్పాహార విందు ఇచ్చారు. ఎంపీలతో సుమారు అరగంట పాటు మోదీ మాట్లాడారు. ఏపీలో చంద్రబాబుతో కలిసి ముందుకు సాగడం మంచి పరిణామమని, ఆయన పాలన కూడా బేషుగ్గా ఉందని కొనియాడారు. పూర్తి సమన్వయంతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. చంద్రబాబు పరిపాలనపై కూడా మంచి ఫీడ్ బ్యాక్ వచ్చిందని ప్రధాని కితాబిచ్చారు. ఏపీకి ఎక్కువగా పెట్టుబడులు వెళ్తున్నాయని.. ఇది శుభపరిణామమన్నారు. రాబోయే రోజుల్లో ఏపీ చాలా అభివృద్ధి చెందే అవకాశం ఉందని ప్రధాని పేర్కొన్నారు. అలాగే జగన్ పార్టీని, సోషల్ మీడియాలో ఆ పార్టీ చేస్తున్న విమర్శలకు బీజేపీ నేతలు కూడా ధీటుగా కౌంటర్ ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు.అటు తెలంగాణలో ఓవైసీ సోషల్ మీడియా కంటే బీజేపీ సోషల్ మీడియా చాలా తక్కువగా ఉందని, బీజేపీ నేతలు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఎందుకు ఉండటం లేదని తెలంగాణ బీజేపీ ఎంపీలపై ప్రధాని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎదిగేందుకు అవకాశాలు ఉన్నాయని, కనీసం ప్రతిపక్ష పాత్ర కూడా సరిగ్గా పోషించడం లేదని ఎంపీలపై మండిపడినట్లు తెలుస్తోంది. మంచి టీమ్‌ను పెట్టుకుని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఉన్నా కూడా సమస్య ఏంటి అని ప్రశ్నించినట్లు సమాచారం. తెలంగాణలో పార్టీ పెరగడానికి మంచి అవకాశం ఉన్నప్పటికీ దాన్ని ఉపయోగించుకోవడంలో విఫలం అవుతున్నారని ప్రధాని మోదీ ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం

శ్రీచక్ర
శుక్రవారం డిసెంబర్ 12 2025

# సంపాదకీయం

## రెంటికి చెడ్డ రేవడిలా మమత

పశ్చిమ బెంగాల్‌లో తిరుగులేని నేతగా ఎదిగారు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ. కమ్యూనిస్టుల కంచుకోటను 15 ఏళ్లక్రితం బద్దలు కొట్టి అధికారం చేపట్టారు. వరుసగా మూడుసార్లు ఎన్నికయ్యారు2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ఇటీవలే జరిగినట్లు అనిపిస్తోంది. వెస్ట్? బెంగాల్? శాసన సభకు ఎన్నికలు జరిగి దాదాపు ఐదేండ్లు గడిచిపోయాయి. వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్? శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. 2026 పశ్చిమ బెంగాల్ స్టేట్? ఎన్నికలు హోరాహోరీగా చాలా పెద్ద పోరాటాన్ని తలపించే విగా ఉంటాయి.గొప్ప ఫ్రెంచ్ రచయిత జీన్ అల్ఫోన్స్ కర్ ఇలా అన్నారు.. ' కొన్ని విషయాలు ఎంతగా మారినా మరికొన్ని విషయాలు అంతకంటే ఎక్కువగా యథాతథంగా అలాగే ఉంటాయి'. ఇది వెస్ట్? బెంగాల్ రాజకీయాలకు పూర్తిగా వర్తిస్తుంది. 2000 నుంచి తృణమూల్? కాంగ్రెస్? అధినేత్రి మమతా బెనర్జీ, బీజేపీ అధ్యక్షుడు సువేందు అధికారి, అదే కాంగ్రెస్ నాయకులు, అదే కమ్యూనిస్ట్ నాయకులు బెంగాల్ రాజకీయాల్లో కొనసాగుతున్నారు. తృ ణమూల్? కాంగ్రెస్? చీఫ్? మమతా బెనర్జీ 2011 నుంచి పశ్చిమబెంగాల్? ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. 1977 నుంచి ఏకధాటిగా పశ్చిమ బెంగాల్?ను పాలిస్తున్న వామపక్ష ప్రభుత్వాన్ని మమతా బెనర్జీ అనూహ్యంగా ఓడించారు. ఇది ఒక సూపర్? హ్యూమన్? టాస్క్?. తృణ మూల్? కాంగ్రెస్? అధినాయకురాలు మమతా బెనర్జీ కాంగ్రెస్ పార్టీని కూడా వెస్ట్? బెంగాల్?లో పూర్తిగా నాశనం చేసింది. 2021లో జరిగిన పశ్చిమ బెంగాల్? రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో కమ్యూనిస్ట్ పార్టీలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు గెలవకుండా మమతా బెనర్జీ అడ్డుకోగలిగారు. ఆమెకు ఎదురు నిలిచిన రాజకీయ శత్రువులు మొత్తం కనుమరుగైపోయారని మమతా బెనర్జీ భావిస్తున్న తరుణంలో.. అకస్మాత్తుగా వెస్ట్? బెంగాల్?లో బీజేపీ ఒక బలమైన రాజకీయ శక్తిగా మారింది. ఇప్పుడు బీజేపీ పశ్చిమ బెంగాల్‌లో ప్రధాన ప్రతిపక్షంగా మారింది. . అయితే ప్రతీ ఎన్నికల్లో మమతాబెనర్జీ పార్టీకి బెంగాల్‌లోని ముస్లింలు అండగా నిలిచారు. దీంతో మమతా కూడా సహజంగానే ఇంతకాలం వారికి అనుకూలంగా వ్యవహరించారు. అయితే ముస్లింలో మెజారిటీ ప్రజలు బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి వలస వచ్చినవారే. అయినా వారిని మమతా పెంచి పోషించారు. అయితే తాజాగా ముర్షిదాబాద్‌లో తృణమూల్ ఎమ్మెల్యే హుమాయూన్ కబీర్ బాబ్రీ మసీదు నిర్మాణానికి ముందుకొచ్చి పార్టీకి సవాలు విసిరాడు. స్థానికులు భారీగా విరాళాలు, సామగ్రి సమర్పించడంతో విషయం విస్తరించింది. మమతా బెనర్జీ వెంటనే ఆయన్ను పార్టీ నుంచి తొలగించి డామేజ్ కంట్రోల్ చేస్తూ తీవ్ర చర్య తీసుకున్నారు. దీంతో హిందువుల్లో సానుభూతి పెరిగింది. బాబ్రీ కూల్చివేతకు వ్యతిరేకంగా ముస్లిం సమాజం నిరసనలకు మమతాబెనర్జీ అనుమతి ఇచ్చారు. ఇది వ్యూహాన్ని సంక్లిష్టం చేసింది. ఒకవైపు మసీదు నిర్మాణాన్ని అడ్డుకుని హిందువులకు అనుకూలంగా వ్యవరించి.. మైనారిటీలకు వ్యతిరేకమయ్యారు. ఇదే సమయంలో బాబ్రీ కూల్చివేత వ్యతిరేక ర్యాలీకి అనుమతి ఇచ్చి.. హిందువుల్లో ఉన్న సానుభూతి పోగొట్టుకున్నారు.ఎంఐఎంతోపాటు బెంగ్లాలోని మతగురువుల మద్దతులో ఎంఐఎం వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తే ముస్లిం ఓట్లు విభజనకు దారితీస్తాయని మమతా ఆందోళన చెందుతున్నారు. తాను పెంచిన నేతలు మతోన్మాద రూపం తీసుకుంటే పార్టీ ఆధిపత్యం దెబ్బతింటుంది. వచ్చే ఎన్నికల్లో ఈ సంఘటనలు ప్రభావం చూపి కూటమి అధికారాన్ని బెంగాల్‌లో ఇబ్బంది పెట్టవచ్చు.మమతా బెనర్జీ పరిస్థితి ఇప్పుడు కుడితిలో పడిన ఎలక చందంగా మారింది. పార్టీ అంతర్గత ఘర్షణలు, మత రాజకీయాల సంక్లిష్టతను తెలియజేస్తోంది. మైనారిటీ మద్దతును కాపాడుకుంటూ మెజారిటీ సానుభూతిని కోల్పోకుండా సమతుల్యత అవసరం. ఈ వివాదం తృణమూల్ భవిష్యత్ వ్యూహాలను పునఃపరిశీలించేలా చేస్తుంది.2021లో బీజేపీతో జరిగిన తీవ్ర పోరాటం తర్వాత మమతా బెనర్జీ బెంగాల్ ఎన్నికలలో విజయం సాధించి ముఖ్యమంత్రి పదవిని అధిష్టించారు. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో నాలుగు ప్రాథమిక రాజకీయ శక్తులు ఉన్నాయి. అవి మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్? కాంగ్రెస్? పార్టీ, కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, లెఫ్ట్ ఫ్రంట్. పశ్చిమ బెంగాల్?లో కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టుల లెఫ్ట్? ఫ్రంట్?లకు కచ్చితమైన చిన్న ఓటు బ్యాంకులు ఉన్నాయి. బెంగాల్‌లో బీజేపీ వేగంగా అభివృద్ధి చెందడం ప్రారంభించింది. 2021 రాష్ట్ర ఎన్నికలలో బీజేపీ 296 మంది ఎమ్మెల్యే స్థానాల్లో 77 మంది ఎమ్మెల్యేలను గెలుచుకుంది, ఇది బీజేపీకి భారీ లాభం. బీజేపీ గెలుపు కోసం కష్టపడి పనిచేస్తోంది. బహుశా బీజేపీ 2021 కంటే ఎక్కువ ఎమ్మెల్యేలను గెలుచుకునే అవకాశం ఉంది. కానీ 28% ముస్లిం జనాభా ఉన్నందున బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకోవడం కష్టం. పశ్చిమ బెంగాల్‌లో నరేంద్ర మోదీ ప్రజాదరణ గణనీయంగా పెరిగింది. తమ రాష్ట్రం అక్రమ వలసదారులతో నిండిపోయిందని బెంగాలీ హిందువులు ఆందోళన చెందుతున్నారు. బెంగాలీలు కూడా తమ సంస్కృతిని మార్చుకోవాలని, పరిశ్రమలను స్వాగతించాలని తెలుసు. బెంగాలీలలో మార్పు నెమ్మదిగా వస్తోంది. కానీ, చారిత్రాత్మకంగా బెంగాల్ కూడా కొత్త ఆలోచనలకు తెరతీసింది. బీజేపీ వంటి జాతీయ పార్టీకి ఓటు వేయాలా వద్దా అని బెంగాలీలు నిశ్శబ్దంగా అంచనా వేస్తున్నారని చెప్పవచ్చు. అస్సాంలోలాగ బెంగాల్ రాజకీయాలను విదేశీయులు నిశ్శబ్దంగా నియంత్రిస్తున్నారనే ఆందోళన కూడా ఉంది. పశ్చిమ బెంగాల్‌లోనూ మార్పు రావొచ్చు, కానీ.. నెమ్మదిగా!వెస్ట్? బెంగాల్‌లో దాదాపు 28% జనాభా కలిగిన మైనారిటీ ఓటుబ్యాంకు ఉంది. ఒకప్పుడు ఈ మైనారిటీ ఓటు బ్యాంకు కాంగ్రెస్, కమ్యూనిస్టులకు అండగా వెన్నుదన్నుగా ఉండేది. కానీ ఇప్పుడు, ముస్లిం ఓటర్లు మమతా బెనర్జీ పార్టీ తృణమూల్? కాంగ్రెస్? వైపు మారారు.

# జిల్లాలో తాగునీటి అవసరాల కోసం టి.బి.డ్యాం నుండి ఏప్రిల్ లో 30 రోజులు నీరు వదలాలి

**జనవరి 10 లోగా ఎంఐ ట్యాంకులు , ఎస్ఎస్ ట్యాంకులు నిండాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**






కర్నూలు , డిసెంబర్ 11 (శ్రీచక్ర): జిల్లాలో తాగునీటి అవసరాల కోసం టి.బి.డ్యాం నుండి ఏప్రిల్ లో 15 రోజులు కాకుండా 30 రోజులు నీరు వదలాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి టీబీ డ్యాం ఎస్ ఈ ని కోరారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో తుంగభద్ర డ్యాం నుండి నీటి విడుదల, వినియోగం తదితర అంశాలపై టీబీ డ్యాం ఎస్ ఈ, ఇరిగేషన్ , ఆర్డబ్ల్యూఎస్ ,హెచ్ ఎన్ ఎస్ ఎస్ ఎస్ ఈ లు తదితర అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తుంగభద్ర డ్యాం నుండి నీటి విడుదలపై అధికారులతో చర్చించారు..జనవరి 10 వ తేదీ వరకు తాగునీటికి,పంటలకు వదలడం జరుగుతుందని, తదుపరి ఏప్రిల్ లో తాగునీటి అవసరాలకు 15 రోజులు వదిలేందుకు బోర్డు నిర్ణయం తీసుకున్నట్లు ఎస్ ఈ నారాయణ నాయక్ కలెక్టర్ కు వివరించారు. ఏప్రిల్ లో 15 రోజులే వదిలితే తాగునీటికి ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉందని, తుంగభద్ర డ్యామ్ నుండి ఎమ్మిగనూరు దగ్గర ఉన్న గుడేకల్లు చేరుకోవటానికి 15 రోజులు పడుతుందని, అందువల్ల 30 రోజులు నీటిని వదలాలని, ఈ అంశంపై స్పెషల్ సి.ఎస్ గారితో మాట్లాడి 30 రోజులు నీరు వదలాలని కోరతామని కలెక్టర్ తెలిపారు..టీబీ బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి 30 రోజులు నీటిని విడుదల చేసేలా నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ ఎస్ ఈ కి తెలియచేశారు.. ఈ అంశంపై ఇరిగేషన్ ఎస్ ఈ కూడా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాలు ఆలస్యమైన పక్షంలో, అవసరాన్ని బట్టి జూలై నెలలో కూడా మరొకసారి నీరు వదిలేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీబీ డ్యాం ఎస్ ఈ కి సూచించారు. జిల్లాలోని అన్ని మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను జనవరి 10 లోపు తుంగభద్ర నది నీటితో నింపే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదేశించారు. ఏప్రిల్ మాసంలో వదిలే నీటిని తాగు నీటికి మాత్రమే వాడుకోవాలని, రైతులు రెండవ పంట వరి కి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. కర్నూలు కార్పొరేషన్ లో నీటి ఎద్దడి రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటిని వదిలే లైన్ మెన్లు, ఫిట్టర్ల తో సమావేశం నిర్వహించి, ఎక్కడా పైపులు లీకేజీ లేకుండా చూసుకోవాలని, నిర్ణీత సమయానికి మాత్రమే నీటిని వదిలి, నీటిని పొదుపుగా వాడే విధంగా ఆదేశాలు జారీ చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సుంకేసుల నుండి కర్నూలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వరకు పైప్ లైన్ పనులను మార్చి లోపు పూర్తిచేయాలని కలెక్టం ఆదేశించారు.. ఆదోని ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతులను వేగంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి , ఇరిగేషన్ ఎస్ ఈ బాలచంద్రారెడ్డి , హెచ్ ఎన్ ఎస్ ఎస్ ఎస్ఈ పాండురంగయ్య , తుంగభద్ర బోర్డు ఎస్ ఈ నారాయణ నాయక్ , కర్నూలు మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి , డిఆర్డిఏ పిడి రమణారెడ్డి ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ , జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, డిపిఓ భాస్కర్ , మున్సిపల్ డెప్యూటీ ఇంజనీర్లు , ఆదోని , గూడూరు , ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# ఖాళీ స్థలాలను స్వచ్ఛందంగా శుభ్రం చేసుకోవాలి

**14వ తేదీ నాటికి అపరిశుభ్రంగా ఉంటే జరిమానాలు**
**జంతువులు, పశువుల యజమానులు స్వచ్ఛతకు సహకరించాలి**
**నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**



కర్నూలు (శ్రీచక్ర)::- స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకునేందుకు సన్నద్ధం అవుతున్న కర్నూలు నగరాన్ని ముందుకు క్లీన్ అండ్ గ్రీన్ సిటీ తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతో ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ సిటీ నిర్మాణానికి నగరపాలక తీసుకుంటున్న చర్యలకు స్వచ్ఛం దంగా సహకరించాలని కోరారు. గురువారం ఆయన నగరపాలక కార్యాల యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లీన్ అండ్ గ్రీన్ సిటీ నిర్మాణంలో భాగంగా 4 ప్రధాన కార్యక్రమా లను అమలు చేస్తున్నామని, వాటిని సమర్థవంతంగా ప్రజల భాగస్వామ్యంతో అమలు చేయగలిగితే క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా ఆవిర్భావం అవుతుందన్నారు. ఖాళీ స్థలాలను 14వ తేదీ నాటికి తప్పనిసరిగా యజమానులు స్వచ్ఛందంగా శుభ్రం చేసుకోవాలని, లేనిపక్షంలో తామే శుభ్రం చేయించి జరిమానాలు విధిస్తామని స్పష్టంగా చేశారు. 325 ఖాళీ స్థలాలను గుర్తించి 182 యజమానులకు పలుమార్లు నోటీసులు జారీ చేశామని, యజమానులు ఆచూకీ లభించకపోవడంతో 143 మందికి నోటీసులు అందలేదన్నారు. 14వ తేదీ నాటికి యజమానులకు నోటీసులు అందకపోయిన స్వచ్ఛందంగా శుభ్రం చేసుకోవాల్సిందేనని, లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. 23 మంది జంతు యజమానులు, 31 పందుల పెంపకపుదారులను గుర్తించామని, వారంలోపు వారు పశువులను, జంతువులను నగర శివార్లలోని చెల్లించకపోతే తాము ఆధీనంలోకి తీసుకుంటామని చెప్పారు. రహదారులపై జంతువులు, పశువులను వదిలేయడం వల్ల ప్రమా దాలు, అసౌకర్యాలు ఎక్కువవుతు న్నాయని కమిషనర్ స్పష్టం చేశారు. ఇకపై జంతువులు రహదారులపై సంచరిస్తే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పశువులను తాత్కాలికంగా ఉంచేందుకు ప్రధాన ప్రాంతాల్లో ప్రదేశాల గుర్తింపు ప్రక్రియ జరుగుతోందని చెప్పారు. అదేవిధంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ప్రార్థన మందిరాలు వంటి జనసమ్మర్ద సంస్థలు వీధి కుక్కలు లోపలికి రాకుండా వెంటనే ప్రహరీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాల్స్ మిగిలిన ఆహారాన్ని రహదారులపై పడేయడం వల్ల వీధి కుక్కల బెడద పెరుగుతోందని, ఇకపై అటువంటి చర్యలు జరిగితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సి డి డి వేస్ట్ మేనేజ్మెంట్ విధానాన్ని తప్పని సరిగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ వ్యర్థాలను కార్పొరేషన్ అనుమతి ఉన్న వాహనాలకే అప్పగించాలని, ట్రాక్టర్‌కు రూ.500/- మరియు టిప్పర్‌కు రూ.1,000/- ఛార్జీలు విధించే విధానం అమల్లో ఉందని వివరించారు. చలానును క్యూ ఆర్ కోడ్ ద్వారా చెల్లించే సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేస్తే జరిమానా, చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అవసరమైతే 7422992299 నెంబర్‌కు కాల్ చేసి వెంటనే సేవలు పొందవచ్చన్నారు. పర్యావరణ హితం, ప్రజల ఆరోగ్యం, నగర శుభ్రత కోసమే ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సహకరిస్తే నగరాన్ని ఆదర్శ క్లీన్ ఉ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దగలమని కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. స్టేడియం రోడ్డులో ఈట్-స్ట్రీట్ ఏర్పాటు పనులు త్వరితగతిన చేస్తున్నామని, వివిధ రకాల మరమ్మత్తులను త్వరలో పూర్తి చేసి, ఖాళీగా 15 స్టాల్స్‌లను పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే 45 స్టాల్స్‌లకు అద్భుత స్పందన లభిస్తోందని తెలిపారు. అదేవిధంగా ఎల్ఆర్‌యస్, బిపియస్ పథకాలకు సంబంధించి వివరాలను తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలి : డాక్టర్. శంకర్ శర్మ





కర్నూలు స్పోర్ట్స్, డిసెంబర్ 11(శ్రీచక్ర):విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని డాక్టర్ శంకర్ శర్మ పేర్కొన్నారు.గుంటూరులో ఈ నెల 6, 7 తేదీల్లో జరిగిన 2వ సౌత్ జోన్ సిలంబం చాంపియన్షిప్లో కర్నూలుకు చెందిన 25 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్, 22 మంది సిల్వర్ మెడల్స్ సాధించి తమ ప్రతిభను కనబరిచారు. గురువారం ఈ సందర్భంగాడాక్టర్.శంకర్ శర్మ వారిని సన్మానించి మాట్లాడారు. కర్నూలు క్రీడా రాజధానిగా పేరొందని, కర్నూలు నుంచి అంతర్జాతీయ క్రీడాకారులు తయారు కావాలని కోరారు. సిలంబంక్రీడావిద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సిలంబంను మొదట కర్రసాము పేరుతోతమిళనాడు రాష్ట్రంలో ప్రారంభమైందన్నారు. సిలంబం క్రీడను ఒలింపిక్ క్రీడల్లో చేర్చే విధంగాఒలింపిక్‌అసోసియేషన్‌తో చర్చలు జరుపుతుందని తెలిపారు. సిలంబం సాధన చేయడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెరగడంతో పాటు శరీరం దృడంగా ఉంటుందన్నారు. ఇలాంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ముఖ్యంగా ఆడపిల్లలకు ఆత్మరక్షణ ఏర్పడుతుందన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు నూతన శాంసంగ్ 5జి మొబైల్స్ అందజేసిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వం

తిరుపతి,డిసెంబర్ 11(శ్రీచక్ర):మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు నూతన శాంసంగ్ 5ఉ మొబైల్స్ అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు.గురువారం జిల్లా సచివాలయం లోని సమావేశ మందిరంలో 2,492 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు (ఏ డబ్ల్యూ డబ్ల్యూ),97 మంది సూపర్‌వైజర్లకు, మరియు 12 మంది బ్లాక్ కో-ఆర్డినేటర్లకు నూతన శాంసంగ్ 5ఉ మొబైల్ ఫోన్లను జిల్లా కలెక్టర్ అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా సంక్షేమం, పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు,సూపర్వైజర్లు, బ్లాక్ కొ ఆర్డినేటర్ లకు 5ఉ మొబైల్ ఫోన్లను అందజేయడం జరిగిందని, అంగన్‌వాడీ కార్యకర్తలు విధి నిర్వహణలో భాగంగా చేస్తున్న సేవలను అభినందించారు.అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు,గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు సంబంధించిన వివరాలు నమోదు,ప్రభుత్వ పథకాల అమలులో సమర్థతను పెంచడానికి ఈ మొబైల్స్ ఉపయోగపడతాయని తెలిపారు.ఈ మొబైల్ ఫోన్స్ ధర ఒక్కొకటి రూ.14000 వంతున మొత్తం 2601 మొబైల్స్ కి సుమారుగా రూ.3.64 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు.అధునాతన మొబైలు ఫోన్ లు వినియోగించుకుని రోజువారీ విధులలో వేగం పెంచి పారదర్శకంగా లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.మొబైల్ పంపిణీ ద్వారా జిల్లాలో సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ మరింత సులభతరం అవుతుందని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారిణి వసంత బాయి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు,జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారిణి వసంత బాయి, నోడల్ ఆఫీసర్ వాసంతి, రేణిగుంట సీడీపీఓ కృష్ణవేణి,అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తికి సహకరించండి

**ఎన్నికల ప్రక్రియలో బిఎల్ఏల పాత్ర కీలకం**
**కర్నూలు నియోజకవర్గ ఆర్వో, కమిషనర్ పి.విశ్వనాథ్**



కర్నూలు, డిసెంబర్ 11 (శ్రీచక్ర): కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎస్ఐఆర్‌ను బూత్ స్థాయిలో ఖచ్చితంగా, ఎలాంటి తప్పుల్లేకుండా పూర్తి చేసేందుకు సహకరించాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గురువారం నగరపాలక కార్యాలయంలో అసిస్టెంట్ ఆర్వోలు, రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూఎస్ఐఆర్‌మ్యాపింగ్‌ను ప్రతి బూత్‌లో అత్యంత జాగ్రత్తతో పూర్తి చేయాల్సినఅవసరంఉందనితెలిపారు. ఓటర్ వివరాలు, చిరునామా ధృవీకరణ,కుటుంబసభ్యులసమాచారం తప్పనిసరిగా బూత్ యాప్ లో ఖచ్చితంగా నమోదు కావాలన్నారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్‌లో నిర్లక్ష్యం చోటుచేసుకుంటే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,74,803 మంది ఓటర్లలో 37,561 మంది మ్యాపింగ్ పూర్తికాగా,15,821మంది ప్రోజనీ వివరాలు నమోదు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం మ్యాపింగ్ శాతం 19.46% ఉందన్నారు. ప్రతి బూత్‌లో 100% మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ఖచ్చితత్వం ఎన్నికల పారదర్శకతకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు.కర్నూలు నియోజకవర్గానికి అదనంగా ముగ్గురు అదనపు ఏఈఆర్వోలను జిల్లా కలెక్టర్ నియమించారని, ఆర్.జి.వి.కృష్ణ (అదనపు కమిషనర్), కె.వి.సతీష్ కుమార్ రెడ్డి (డిప్యూటీ కమిషనర్), పి.వి.శేష సాయి (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) ప్రతిరోజూ బీఎల్వో సూపర్వైజర్లు, బీఎల్‌వోల ఎస్ఐఆర్ పనితీరును సమీక్షిస్తున్నారని తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎస్ఐఆర్ మ్యాపింగ్ చేస్తున్నారని, బీఎల్‌వో సూపర్వైజర్లు ప్రతిరోజూ బీఎల్‌వో లు సందర్శించిన ఇళ్ల సంఖ్య, మ్యాపింగ్ పురోగతి, కుటుంబ వివరాలు పూర్తి చేశారా అన్న విషయాలను పరిశీలిస్తున్నారని ఆర్వో వివరించారు.

## ఆదోని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్







ఆదోని, డిసెంబర్ 11 (శ్రీచక్ర): ఆదోని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం వార్షిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆదోని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు,కేసుల దర్యాప్తులు, వాటి పురోగతి పై కేసుల ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. డ్రంకెన్ డ్రైవ్, ఒపెన్ డ్రింకింగ్ లపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలన్నారు.ప్రాపర్టీ కేసులనుచేధించాలన్నారు రికవరీలు చేయాల న్నారు. విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు. బాధితులు పోలీసుస్టేషన్ ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. సైబర్ నేరాల పై, మహిళల చట్టాలపై ప్రజలకు అవగాహన చేయాల న్నారు. పోలీసు సిబ్బంది యొక్క సంక్షేమనీ గురించి, వారి సమస్యలను ఆరా తీశారు. సిబ్బందికి సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీతో పాటు ఆదోని డిఎస్పీ హేమలత, డిసిఆర్ బి సిఐ గుణశేఖర్ బాబు, ఆదోని ఒకటవ పట్టణ సిఐ శ్రీరామ్ , ఎస్సై సమీర్ బాషా , పోలీసు సిబ్బంది ఉన్నారు.

## ఆదోనిలో రక్షక్ ఫ్యూయల్ పెట్రోల్ పంప్ స్టేషన్ ను ప్రారంభించిన... కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఆదోని, డిసెంబర్ 11 (శ్రీచక్ర): ఆదోని రెండవ పట్టణ పోలీసుస్టేషన్ దగ్గర ఏర్పాటు చేసిన రక్షక్ ఫ్యూయల్ పెట్రోల్ పంప్ స్టేషన్ ను కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ , జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్నూలు రేంజ్ డిఐజి మీడియాతో మాట్లాడారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్ పి సి ఎల్ ఆయిల్ పంప్ స్టేషన్ ద్వారా వినియోగదారులైన ప్రజలకు ఎటువంటి కల్తీ లేని, నాణ్యమైన పెట్రోల్‌ను సరఫరా చేసి ప్రజలకు మంచి సేవలు అందించడమే ఈ పెట్రోల్ పంప్ స్టేషన్ ముఖ్య ఉద్దేశమన్నారు. అంతేకాకుండా, ఈ పెట్రోల్ బంక్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని పోలీస్ సంక్షేమ నిధికి (పోలీసు వెల్ఫేర్) వినియోగిస్తామన్నారు. పోలీసు శాఖ కు మరియు ఊఖఅఒ వారికి 2011 నుండి ఈ రకమైన అనుబంధం ఏర్పడిందన్నారు. మొట్టమొదటగా ఉమ్మడి రాష్ట్రంలో నేటి డిజిపి కార్యాలయం ఉన్న 6 వ పటాళంలో మొదటి సారిగా ఎచ్పీసీఎల్ ఆయిల్ కంపెనీ మరియు పోలీసు వేల్ఫేర్ కలిసి మొట్ట మొదట పెట్రోల్ పంప్ స్టేషన్ ఏర్పాటు చేశారన్నారు. కాకినాడ, విజయనగరం, విశాఖపట్నం, పలు చోట్ల పెట్రోల్ పంప్ స్టేషన్లు ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు రేంజ్ డిఐజి, జిల్లా ఎస్పీ గారులతో పాటు ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, రాయలసీమ హెచ్ పి సిఎల్ రీజియన్ రీజనల్ మేనేజర్ మన్మథరావు, ఆదోని డిఎస్పీ హేమలత, పత్తికొండ డిఎస్పీ వెంకటరామయ్య, ఎమ్మిగనూరు డిఎస్పీ భార్గవి, ఆదోని రెండవ పట్టణ సిఐ రాజశేఖర్ రెడ్డి, ఇతర సిఐలు రామలింగమయ్య, నల్లప్ప , గౌస్ , శ్రీరామ్ , ఆర్ ఎస్సై ప్రదీప్ కుమార్, మరియు ఇతర పోలీసు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఇద్దరి పై జిల్లా బహిష్కరణ ఉత్తర్వుల జారీ

### కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్
### కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్





కర్నూలు, సెసంబర్ 11 (శ్రీచక్ర): కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో షరీన్ నగర్ నందు నివాసముండే కిరాయి హంతకుడు వడ్డే రామాంజనేయులు ఏ వడ్డే అంజి మరియు సస్పెక్ట్ షీటర్ 216 అయిన పఠాన్ ఇమ్రాన్ ఖాన్ అనే ఈ ఇద్దరు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అలవాటు పడిన వీరి ఇద్దరిపై కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ . సిరి జిల్లా బహిష్కరణ ఉత్తర్వులను జారీ చేయడం జరిగింది. కర్నూలు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ నందు వడ్డే రామాంజినేయులు ఏ వడ్డే అంజి మీద జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ లలో 17కుపైగాక్రిమినల్ కేసులు ఉన్నాయి. అందులో హత్యలు, దోపిడీలు, ఎస్సీ ఎస్టీ వర్గాల మీద దాడులు, జులుం కేసులు, హత్యాయత్నం కేసులు ఇలా పలు రకాల కేసులు నమోదయి ఉ న్నాయి. అదే విధంగా మరొక వ్యక్తి అయిన పఠాన్ ఇమ్రాన్ ఖాన్ మీద కూడా సుమారు 19 క్రిమినల్ కేసుల్లో నిందితుడు గా ఉన్నాడు.పలుమార్లు వీరి పై తెలిపిన కేసుల్లో రిమాండ్కు వెళ్లినా కూడా వారిలో ఎటువంటి మార్పు రాకపోవడం, మరియు అదేవిధంగా 2022 వ సంవత్సరంలో వీరిద్దరూ కూడా పిడి ఆక్ట్ నిర్బంద ఉ త్తర్వుల కింద కడప సెంట్రల్ జైల్లో ఖైదు చేయబడినప్పటికీ వీరి ప్రవర్తనలో మార్పు రాకపోగా, తదుపరి కూడా రకరకాల కేసులలో పాల్గొంటున్నారని కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ యొక్క ప్రతిపాదనల మేరకు వారి ఇద్దరి యొక్క క్రిమినల్ రికార్డు లను నిశితంగా పరిశీలించిన మీదట జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఈ నెల10 వ తేదీన ఇద్దరి మీద జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటినుండి ఎవరైనా రౌడీయిజంతో అరాచక శక్తులుగా మారి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలగజేసే విధంగా ప్రవర్తిస్తే అటువంటి వారిపై జిల్లా బహిష్కరణతో పాటుగా పీడియాక్ట్ నమోదు చేసి జైలుకు తరలించడం జరుగుతుందని, ప్రశాంతంగా, మంచిగా, బుద్ధిగా జీవించాలని జిల్లా ఎస్పీ కోరారు.ఇటువంటి చెడు నడత కలిగిన వారి పై మరియు ఇంకా కొంత మంది పై కూడా జిల్లా బహిష్కరణ గురించి పరిశీలనలో ఉన్నాయని కర్నూల్ జిల్లా ఎస్పీ తెలిపారు.

## ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అన్న క్యాంటీన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

### నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి





కర్నూలు, డిసెంబర్ 11 (శ్రీచక్ర): అన్న క్యాంటీన్ ద్వారా నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని జిల్లాకలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అన్న క్యాంటీన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ క్యాంటీన్‌లో అందిస్తున్న భోజన నాణ్యత, వంటశాల పరిశుభ్రత, పాత్రల శుభ్రత, భోజనం చేసే ప్రాంతం, కూర్చునే సౌకర్యాలు, టోకెన్ వ్యవస్థ, తాగునీటి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం క్యాంటీన్ సిబ్బంది, భోజనం చేస్తున్న ప్రజలతో కలెక్టర్ మాట్లాడి, భోజనం ఎలా ఉంది అని వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. భోజనం చేస్తున్న వారిలో ఒక వ్యక్తి మాట్లాడుతూ..."మా బంధువు మూడు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరారు, అన్న క్యాంటీన్‌లోనే ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజనం చేస్తున్నాము. తక్కువ ధరకు మంచి నాణ్యతతో భోజనం లభిస్తోంది. బయట కంటే ఇక్కడి భోజనం చాలా బాగుంది" అని తెలిపారు. మిగిలిన వారు కూడా భోజనం రుచిగా ఉందని తెలిపారు. అన్న క్యాంటీన్ నిర్వహణలో లోపాలు ఉండకూడదని, పరిశుభ్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. భోజన నాణ్యతపై రోజువారీ తనిఖీలు నిర్వహించి, రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు ఉన్నారు.

## డిసెంబర్ 21 న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో జిల్లాలో వంద శాతం వ్యాక్సినేషన్ చేయించాలి:జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి





కర్నూలు, డిసెంబర్ 11 (శ్రీచక్ర): డిసెంబర్ 21 నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో జిల్లాలో వంద శాతం వ్యాక్సినేషన్ చేయించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ సిఎల్జి బ్లాక్ లో పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ లకు, సూపర్వైజర్ లకు, ఇతర వైద్య సిబ్బందికి పల్స్ పోలియో సెన్సిటైజేషన్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 21 వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో జిల్లాలో 5 ఏళ్ల లోపు వయస్సు ఉన్న 3 లక్షల 52 వేల 164 మంది పిల్లలు అందరికీ పల్స్ పోలియో వ్యాక్సిన్ వేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు... ×వైద్య సేవలపై ప్రజల నుండి వంద శాతం పాజిటివ్ ఫీడ్ బ్యాక్ రావాలిప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు అందుబాటులో ఉంటున్నారా, లేదా, మందులను ఫార్మసీ లో ఇవ్వకుండా బయటికి పంపిస్తున్నారా, లేదా, ఏదైనా పరీక్షలకు బయటికి పంపిస్తున్నారా, డెలివరీ అయిన తర్వాత వైద్య సిబ్బంది ఏమైనా డబ్బులు వసూలు చేస్తున్నారా, లేదా, పారిశుధ్యం బాగుందా, లేదా, వైద్యులు సరిగా వైద్యం చేస్తున్నారా, లేదా, అనే అంశాల మీద ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరుగుతోందన్నారు..ఈ అంశాల్లో ప్రజలు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ప్రజలు సంతృప్తి చెందేలా పిహెచ్సి, యుపిహెచ్సి లలో వైద్యులు అందుబాటులో ఉండి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్ లను ఆదేశించారు.. అదే విధంగా సిబ్బంది మందులకు బయటకు పంపకూడదని, డెలివరీ అయిన తర్వాత పేషెంట్ నుండి వైద్య సిబ్బంది డబ్బులు వసూలు చేయకుండా చూసుకోవాలని, ఈ అంశాల పై మెడికల్ ఆఫీసర్ లు వారానికి 2 సార్లు సమీక్ష నిర్వహించుకుని, ఇకపై ప్రజల నుండి నెగెటివ్ ఫీడ్ బ్యాక్ రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు... అదే విధంగా కొన్ని పిహెచ్సి లలో 5 కంటే తక్కువ డెలివరీ లు జరుగుతున్నాయని, ఖచ్చితంగా కనీసం 10 డెలివరీ లు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ లను ఆదేశించారు.. డి ఎం హెచ్ ఓ డా.భాస్కర్ రాజు మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా రైల్వే స్టేషన్లు, బస్ స్టాప్‌లు, మార్కెట్లు తదితర ప్రదేశాలలో 1600 వ్యాక్సినేషన్ బూత్ లను, 52 పోలియో ట్రాన్సిట్ పాయింట్ (ఖుఖ) లను ఏర్పాటు చేశామని, 63 మొబైల్ టీం లను నియమించామని కలెక్టర్ కు వివరించారు..సమావేశంలో డి ఎం హెచ్ ఓ డా.భాస్కర్ రాజు, జి జి హెచ్ సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి సింధు సుబ్రమణ్యం, మెడికల్ ఆఫీసర్ లు, సూపర్వైజర్ లు తదితరులు పాల్గొన్నారు..

## కర్నూలు జిల్లా జైలు మరియు మహిళా జైళ్ళను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి





కర్నూలు లీగల్, డిసెంబర్ 11 ( శ్రీ చక్ర ): జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రిలు పురుషుల జిల్లా కారాగారము మరియు మహిళ కారాగారాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జైలులో ఏర్పాటు చేసిన ప్రిజన్ లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్క్ మరియు క్లినిక్ను తనిఖీ చేశారు. ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్క్ ఒక్లినిక్స్ గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలు వారి కున్న హక్కులను తెలుసు కోవాలని తెలిపారు. ఖైధిలకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ళు వయస్సు పైబడిన ఖైధిలకు, అనారోగ్యంతో బాధ పడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని అన్నారు. ఖైధిలకు అందించే ఆహారాన్ని, రేషన్ను, ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైధిలను కోర్ట్ వాయిదాలకు కచ్చితంగా హాజరు చెయ్యాలని ఆదేశిం చారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, లీగల్ ఎయిడ్ న్యాయవాది శివరాం, ఖైదీలు పాల్గొన్నారు.

## రూ.15 కోట్లతో రెండు రోడ్లకు ఎమ్మెల్యే ఆదిమూలం భూమి పూజ

**అంగన్వాడీలకు నియామక పత్రం పంపిణీ చేసిన ఎమ్మెల్యే**
**సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆకస్మిక తనిఖీ**

సత్యవేడు,డిసెంబర్ 11(శ్రీచక్ర):సత్యవేడు నియోజకవర్గంలో రోడ్లకు మహర్దశ కలగనున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురు వారం సత్యవేడు ఐసీడీఎస్ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకొని కొత్తగా నియామకం అయిన అంగన్వాడీ కార్యకర్తలకు అపాయింట్మెంట్ లెటర్ లను పంపిణీ చేశారు.అనంతరం అంగన్వాడీ లకు ప్రభుత్వం అందించిన మొబైల్ ఫోన్ లను పంపిణీ చేశారు.తదుపరి సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రి ఉద్యోగుల హాజరు పట్టీ, రికార్డులను పరిశీలించారు. అనం తరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు.అక్కడ నుండి సత్యవేడు మండలంలోని వి.ఆర్ కండ్రిగకు చేరుకొని రూ.4 కోట్లతో నిర్మించ తలపెట్టిన వి.ఆర్ కండ్రిగ – టి.పీ పాలెం రోడ్డుకు ఎమ్మెల్యే ఆదిమూలం భూమి పూజ చేశారు. తదుపరి సత్యవేడు మండలంలోని ఇరుగులం, మల్లవారి పాలెం గ్రామా ల్లో ఎమ్మెల్యే పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు.చివరగా నాగలాపురం మండలంలో రూ.11.00 కోట్లతో నిర్మించ తలపెట్టిన నాగలాపురం– చిన్న పాండూరు రోడ్డుకూ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేస్తారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను కూటమి ప్రభుత్వం లో ఎప్పటికప్పుడు బాగు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# వైఎస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజి ఎమ్మెల్యే అన్నా



మార్కాపురం డిసెంబర్ 11 శ్రీ చక్రమార్కాపురం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేట్ పరం చేస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవోలకు నిరసనగా ఆఉత్తర్వులను వెనువెంటనే రద్దు చేసి ప్రభుత్వమే మెడికల్కాలేజీలనిర్మాణం,నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ×కార్యక్రమంలో భాగంగా మార్కాపురం పట్టణంలో 20,21వ బ్లాక్ ల నందు మాజీ ఎమ్మెల్యే,వైయస్సార్ సీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు మార్కాపురం వైస్సార్సీపీ పట్టణ అధ్యక్షులు షేక్ సలీం పాల్గొన్నారు.కోటి సంతకాల ప్రజా ఉద్యమం× ×ఈ ప్రభుత్వానికి కనువిప్పు కావాలన్నారు

# మాజీ మంత్రి బాలినేని కి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువ

## జిల్లా నలుమూల నుండి హైదరాబాదు లోని. ఆయన స్వగృహానికి పోటెత్తిన అభిమానులు



మార్కాపురం డిసెంబర్ 11 శ్రీ చక్రమార్కాపురం మాజీ మంత్రి, జనసేన రాష్ట్ర నాయకులు, ప్రకాశం జిల్లా టైగర్ బాలినేని శ్రీనివాసరెడ్డి కి ప్రకాశం జిల్లా నలుమూలల నుండి నాయకులు, కార్యకర్తలు గురువారం హైదరాబాదులోని ఆయన నివాసానికి పెద్ద ఎత్తున తరలి వెళ్లి శాలువాలు, పూలమాలలు, బొకేలతో ఘనంగా సన్మానించి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు..బాలినేని శ్రీనివాసరెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో విరజిల్లి, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, మార్కాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుంటక సుబ్బారెడ్డి, మాజీ డి ఆర్ యు సి సి మెంబర్ ఎమ్.ఎన్ రెడ్డి,షేక్ అన్వర్ హుస్సేన్, దొంతుల హరి కిషోర్ (కాపునాడు స్టేట్ వైస్ ప్రెసిడెంట్), ఒంగోలు కార్పొరేటర్ గోలి కోటేశ్వరమ్మ, మరియు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమేషు తాళ్లూరు మాజీ జెడ్పిటిసి వెంకటరెడ్డి, జిల్లా నలుమూలల నుండి బాలినేని అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

# ఆత్మానిర్భార్ స్వయం సమృద్ధి భారత్ భారత్ కార్యక్రమం

## భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు శాసనాల సరోజిని



మార్కాపురం డిసెంబర్ 11 శ్రీ చక్రమార్కాపురంపట్టణంలోనితర్లపాడు రోడ్డులో గల ఆంజనేయస్వామి గుడి సమీపంలో మున్సిపల్ పార్కు నందు బిజెపి ఆధ్వర్యంలో ఆత్మానిర్భార్ స్వయం సమృద్ధి భారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటా స్వదేశీ ఇంటింటా స్వదేశీ నినాదంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. నా వంతు నేను ఆత్మ అభిమానంతో ఆత్మ సమర్పణతో భరతమాత మీద ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా బిజెపి మాజీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు శాసనాల సరోజిని, బిజెపి మాజీ అసెంబ్లీ కన్వీనర్ మరియు జిల్లా కార్యదర్శి చిన్నయ్య మాట్లాడుతూ స్వదేశీ వస్తువులను మనం వాడాలి, మన దేశాన్ని మనం గౌరవించుకుంటూ కలిసికట్టుగా బలపరుచుకుందాం అని పిలుపునిచ్చారు. అలాగే భవిష్యత్తు తరాలకు మంచి బాటలు వేద్దాం అనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోడీ స్వయం సమృద్ధి భారత్, ప్రతి ఇంటా స్వదేశీ ఇంటింటా స్వదేశీ అనే నినాదంతో కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ సీనియర్ నాయకులు పొట్టి సుబ్బారావు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అవొపా ఆధ్వర్యంలో వృద్ధులకు వితంతువులకు దుప్పట్లు పంపిణీ

## సమాజసేవలో అవొపా మార్కాపురం శాఖ





మార్కాపురం డిసెంబర్ 11 శ్రీ చక్రమార్కాపురం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(అవొపా ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ అవొపా ఆఫీస్ వద్ద పేదవారికి మరియు వృద్ధులకు.దుప్పట్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా అవొపా అధ్యక్షులు చీదెళ్ల. లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజంలో అందరికీ ఉపయోగపడేలాసేవాకార్యక్రమాలు చేస్తున్నామని తెలియజేశారు. గాంధీ జయంతినిపురస్కరించుకొని మూడు మండలాల పరిధిలో 6 నుంచి 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, చెన్నకేశవ స్వామి తిరుణాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు మరియు రథసప్తమిసందర్భంగాఅల్పాహారం కార్యక్రమాలుఏర్పాటుచేస్తున్నామనితెలియజేశారు.తదనంతరం బీసీ వెల్ఫేర్ హాస్టల్లో చదువుతున్న ఇంటర్, డిగ్రీ, బి ఫార్మసీ మరియు బిటెక్ విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అధ్యక్షులు చీదెళ్ల. లక్ష్మణరావు మాట్లాడుతూ యువత ఫ్యాషన్ కటింగ్ లకు మరియు సెల్ ఫోన్ వాడకానికి ఎక్కువగా అలవాటు పడి చదువు పట్ల శ్రద్ధ చూపడం లేదని, జీవితంలో కష్టపడి ఉన్నత స్థితికి వచ్చిన వారి గురించి తెలియజేసి మీరు కూడా కష్టపడి మంచి ఉన్నత స్థితికి రావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జివి సుబ్రమణ్యం మాట్లాడుతూ కష్టపడి జీవితంలో రాణించాలని తెలియజేశారు. గౌరవ అధ్యక్షులు సూరే వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుబ్బారావు, స్టేట్ నెంబర్ రామ శేఖర్, కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, పిచ్చి రావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, మధుసూదన్ రావు, కేశవరావు, రామకృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం

## ఈ కార్యక్రమంలో ముఖ్య వక్త వ దుర్గా వాహిని గొల్ల అపఅపర్ణ




మార్కాపురం డిసెంబర్ 11 శ్రీ చక్రమా ర్కాపురం జిల్లా దుర్గా వాహిని సంయోజక గోళ్ళ అపర్ణ మాట్లాడుతూ భారతదేశం ముందు ఒక కొత్త సవాలు కనిపిస్తోంది యువతలో పెరుగుతున్న మాదకద్రవ్య వ్యసనం యువకులు మరియు స్త్రీలలోనే కాకుండా పాఠశాల పిల్లలలో కూడా మద్యం మరియు మాదకద్రవ్య వ్యసనం వేగంగా పెరుగుతోంది. మాదకద్ర వ్యాలు ఒక వ్యక్తి యొక్క సంబంధాలు, ఆర్థిక పరిస్థితి, కుటుంబ పరిస్థితి, విద్య, ఆరోగ్యం మరియు భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి పిల్లలకు అక్కడ ఉన్న విద్యార్థులకు తెలియజేశారు.పిల్లలు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలంటే వాళ్లనివ్యాయామం, యోగా, ఆధ్యాత్మికత, సామాజిక పరస్పర చర్య మరియు జ్ఞానోదయం ద్వారా మన యువతను ఈ ప్రమాదం నుండి మేల్కొలిపి రక్షించవచ్చు అన్నారుఈ సమస్యలను మరియు మన కుటుంబాలలోని ప్రమాదాలను కూడా మనం బహిరంగంగా చర్చిం చాలి. మాదకద్రవ్య వ్యసనం పిల్లల ప్రవర్తన లో మార్పులకు కారణమవు తుంది, ఇది ఈ ప్రమాదాన్ని సూచి స్తుంది. ఆరోగ్య రంగంలో పునరావాస సౌకర్యాలు ఏర్పాటు చేయబడ్డాయి అని వీటిని మనం మాదకద్రవ్యాలకు బానిసైన యువత కోసం ఉపయోగించవచ్చు. కౌన్సెలింగ్ మరియు వైద్య చికిత్స కూడా అవసరం. సమాజంలో తీవ్ర అప్రమత్తత కూడా అవసరం అని చెప్పారుమన చుట్టూ ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతుంటే వాటిని ముందుగా గమనించిఈ వ్యసన చక్రంలో చిక్కుకున్న యువతను విడిపించడానికి కూడా ప్రయత్నాలు జరగాలి అని చెప్పారు. సామాజిక–ఆధ్యాత్మిక సంస్థలు మరియు సమాజం యొక్క ఎక్కువ భాగస్వామ్యంతో మనం ఈ సవాలును ఎదుర్కోగలం అని వివరించారు.తదనంతరంపిల్లలతో, ఉపాధ్యాయులతో ఆకార్యక్రమానికి విచ్చేసిన పెద్దలతో నా దేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చడానికి నా వంతు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారుఈ కార్యక్రమానికి ముఖ్య వక్త విశ్వహిందూ పరిషత్ మార్కాపురం జిల్లా దుర్గా వాహిని సంయోజక గోళ్ళ అపర్ణ మాతృ శక్తి సహసంయోజకలు శ్రీమతి సబితా , శ్రీమతి ప్రసన్న గ మరియు స్కూల్ ప్రిన్సిపల్ మల్లికార్జున్ గారు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

# దర్శి నియోజకవర్గం.నీ మార్కాప జిల్లాలో కలపాలని చెన్నకేశవ స్వామి కి వినతి పత్రం అందజేసిన విద్యావంతులు మేధావుల. వేదిక సభ్యులు



మార్కాపురం డిసెంబర్ 11 శ్రీ చక్రమార్కాపురం జిల్లా విద్యావంతుల మరియు మేధావుల వేదిక ఆధ్వర్యంలో మార్కాపురం జిల్లాలో దర్శి నియోజక వర్గాన్ని చేర్చాలని కోరుతూ మార్కాపురం శ్రీ లక్ష్మిచెన్నకేశవ స్వామి శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి దేవాలయంలోను, అనంతరం నెహ్రు బజార్ లోని శ్రీ షిర్డీసాయిబాబా మందిరంలో వినతిపత్రాలు దేవునిసన్నిధిలో పెట్టి పూజించి దేవదే వుడిని కోరుతూ పూజలు చెయడం జరిగింది. అనంతరం కమలా జూనియర్ కాలేజీలో విధ్యా ర్థులకు జిల్లాలో దర్శి నియోజకవర్గం చేర్చడం పై అవగాహన కల్పించబడింది. ఈ కార్యక్రంలో ఈ. చెన్నయ్య. ఓరుగంటి మల్లిక్,డా.. అన్నపురెడ్డి వీరారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ అభినయ రెడ్డి నేడు కోట కు రాక

కోట:డిసెంబర్ 11 (శ్రీచక్ర) :నెల్లూరు కిమ్స్ (బొల్లినేని)హాస్పిటల్ నుండి అనుభవజ్ఞనులైన డాక్టర్ వి అభినయరెడ్డి శుక్రవారం కోట జనతాక్లినిక్ ఆసుపత్రి వస్తున్నట్లు డాక్టర్ జగదీష్, డాక్టర్ ఉమేరా లు తెలిపారు.ఈ అవకాశాన్ని కోట,వాకాడు,చిట్టమూరు మండలాల్లోని ప్రజలు నరాల వ్యాధి కి చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# బిజేపి నేత సతీష్ రావు కుటుంబాన్ని పరామర్శించిన బిజెపి నేతలు

## కోనసీమ జిల్లా అధ్యక్షులు అడబాల, అనకాపల్లి ఇంచార్జి చిట్టిబాబు. పరామర్శించిన వారిలో పలువురు బిజెపి శ్రేణులు



రామచంద్రపురం, డిసెంబర్ 11( శ్రీచక్ర)హసన్ బాద గ్రామ సర్పంచ్, బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చ కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు తల్లి పరమపదించిన సందర్భంగా వారి కుటుంబ సభ్యులను బిజెపి డా:బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, బిజెపి అనకాపల్లి జిల్లా ఇంచార్జి కర్రి చిట్టిబాబు,బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు చెదుకూరి గోపి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు పరామర్శించారు. రామచం ద్రపురం నియోజకవర్గ బిజెపి మండల,పట్టణ అధ్యక్షులు ఆకేటి శ్రీకృష్ణ,పుణ్యవంతుల శివాజీ,వాసంసెట్టి చందు, దునే శ్రీను,కాజులూరు ఇంచార్జి సలాది శేఖర్,రామచంద్రపురం పట్టణ ఇంచార్జి అవసరాల వెంకటరమణ మూర్తి,జిల్లా కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి గుర్రాల సత్యనారాయణ,గంగవరం మండల ఇంచార్జి రాఘువేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టువాడ హరిబాబు,జిల్లా స్వచ్ఛ భారత్ కన్వీనర్ సలాది సతీష్ నాయుడు, ఓబీసీ నాయకులు ఇంధన సత్యనారాయణ, బిజెపి నాయకులు సాదిక్,కాపవరం ఎం.పి.టి.సి.సతీష్,బాలాంతరం సర్పంచ్ చాగంటి సాంబ,పి.ఏ. సి.ఎస్.త్రిసభ్య కమిటీ సభ్యులు చోడిశెట్టి వీరభద్రరావు, నీటిపారుదల సభ్యులు బొల్లం సత్తిరాజు, గొల్లపల్లి సుబ్బారాయుడు,నున్న వీరబాబు,భలే బాబురావు,ద్రాక్షారామ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సూపర్వైజర్స్ ఏఎన్ఎం లు,ఎం.ఎల్.ఎచ్.పి లు,ఆశాలు,స్థానిక ఆరోగ్య, సచివాలయం ,రెవిన్యూ, అంగన్వాడీ,సిబ్బంది,గ్రామస్థులు తదితరులు సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావును పరామర్శించారు.



# వి ఆర్ ఏ ల దీర్ఘకాలిక సమస్యలును పరిష్కరించాలి

## తహసీల్దార్ కి వినతిపత్రం ను అందజేస్తున్న వి ఆర్ ఏ లు

కోట: డిసెంబర్ 11(శ్రీ చక్ర): వి ఆర్ ఏ ల సమస్యలును పరిష్కరించాలని వి ఆర్ ఏ లు స్థానిక తహసీల్దార్ కటారి.జయ జయ రావు కి వినతిపత్రంను అందజేశారు.ఈ సందర్బంగా గురువారం వి ఆర్ ఏ లకు ఉద్యోగ భద్రత,పలు సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు.అనంతరం వి ఆర్ ఏ లు మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాలనుండి ప్రజలకు, ప్రభుత్వాలకు,అధికారులుకు పలు రకాలుగా సేవలు చేస్తున్నప్పటికి జీతభత్యాలు పెంచకుండా,రక్షణ లేకుండా చేస్తున్నారని వాపోయారు.వి ఆర్ ఏ లను 4 వ తరగతి ఉద్యోగులుగా గుర్తిస్తూ పే స్కేల్ ఇవ్వాలని, నామిని వి ఆర్ ఏ లను రెగ్యులర్ చేయాలనీ, ఖాళీలు ఏర్పడి దీర్ఘకాలికంగా భర్తీ చేయని వి ఆర్ ఏ,వాచ్ మెన్,వి ఆర్ ఏ, అటెండర్,డ్రైవర్లు,లైన్ మెన్,పదోన్నతలు వెంటనే కల్పించాలన్నారు.అదేవిధంగా ప్రస్తుతం ఉన్న కోటాను 30 శాతం నుండి 70 శాతం వరకు పెంచాలని తెలిపారు.అంతేకాకుండా విజయవాడ మంగళగిరి లో డిసెంబర్ 16 వ తేది మంగళవారం ఉదయం 11 గంటలకు మహాధర్నా కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తూపిలి.సుబ్రహ్మణ్యం,ఉపాధ్యక్షులు షేక్.సిరాజ్, ట్రెజరర్ దాసరి. అనిత,తదితర వి ఆర్ ఏ లు డి.అంకయ్య,వెంకయ్య,ఎస్ సుబ్రహ్మణ్యం,పి.కస్తూరయ్య, పి.శ్రీనివాసులు,జి.లక్ష్మమ్మ, టీ.సౌజన్య,పి.రమణయ్య,తదితరులు ఉన్నారు.





శ్రీచక్ర
SREECHAKRA TELUGU DAILY
శుక్రవారం డిసెంబర్ 12 2025

## పోలవరం జిల్లా లో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలి... జిల్లా సాధన కమిటి




జీలుగుమిల్లి డిసెంబర్ 11 (శ్రీ చక్ర)రంపచోడవరం కేంద్రంగా పోలవరంపేరుతో ఏర్పడే జిల్లా లో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని జిల్లా సాధన కమిటి సభ్యులు నాయకులు సిరిబత్తుల సీతారామయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలం లోని కోరుటూరు పునరావాస కాలని లోని సచివాలయ పరిధిలో వ్యవసాయ సంఘం తో పాటు జె ఏ సి ఆద్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం, పోలవరం నియోజకవర్గం లోని టీ నర్సాపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం గోపాలపురం, మండలాల్లోని షెడ్యూల్డ్ గ్రామాలను కలుపుతూ పోలవరం జిల్లా ఏర్పాటు చేయాలని నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం సచివాలయ సిబ్బందికివినతిపత్రాన్నిఅందజేసినట్లుతెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుటూరు సర్పంచ్ రామ్ గోపాల్ రెడ్డి, నాయకులు కారం. నాగదుర్గ,కె. జగదీష్,సీతారాంరెడ్డి,పోసిరెడ్డి పాల్గొన్నారు..

## అంకన్నగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

### విద్యార్థుల భద్రతపై స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ జగదీశ్వరి ఆరా





జీలుగుమిల్లి డిసెంబర్11 ( శ్రీ చక్ర )గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, సంరక్షణపై రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి గురువారం అంకన్నగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని బోధన, నివాస, ఆహార వసతులు, భద్రతా వ్యవస్థలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇటీవల చోటుచేసుకున్న ఒక ఘటనకు సంబంధించి విద్యార్థిని గర్భధారణ వ్యవహారంపై పాఠశాల టీచర్లు, పర్యవేక్షక సిబ్బంది నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన ఎలా చోటుచేసుకుంది? పాఠశాల పర్యవేక్షణలో ఎలాంటి లోపాలు ఉన్నాయో? విద్యార్థుల భద్రత, ఆరోగ్య పరిరక్షణలో ఎవరి వైఫల్యం దారితీసిందో? వంటి విషయాలపై స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ సమగ్రంగా విచారణ జరిపారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి రోజువారీ సమస్యలు, వసతి గృహ పరిస్థితులు, ఆరోగ్య సేవలు, భద్రతా చర్యలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. పాఠశాల కిచెన్‌ను అకస్మాత్తుగా పరిశీలించి అందిస్తున్న ఆహారం నాణ్యతను పర్యవేక్షించారు. అనంతరం విద్యార్థులతో పాటు భోజనం చేశారు.

## పడకేసిన రియల్ ఎస్టేట్..

అమరావతి, డిసెంబర్ 11, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న నిర్ణయాలతో అమరావతి ప్రాంత రైతులకు సంబంధించిన భూముల విలువ ధమాల్ అని పడిపోయింది. 2014 ఎన్నికల్లో గెలిచిన తర్వాత అమరావతి రాజధానిగా ప్రకటించిన సమయంలో రాజధాని ప్రాంతంలో ఎకరం భూమి నలభై లక్ష రూపాయలు చేసే భూమి ఒక్కసారిగా ఎనభై లక్షల రూపాయల వరకూ పలికింది. రాజధాని ఇక్కడకు వస్తుందని తెలిసి అనేక మంది కొనుగోలు చేయడానికి ముందుకు రావడంతో రాజధాని ప్రాంతమే కాకుండా గుంటూరు జిల్లాలోని భూములకు కూడా ఒక్కసారి ధరలు పెరిగాయి. అక్కడకు కార్లలో అధిక సంఖ్యలో రియల్ వ్యాపారులు వచ్చి భూములుబేరాలు ఆడి కొనేవారు. కానీ నేడు బేరమాడే వారు కూడా లేరు.అయితే 2019 ఎన్నికలలో జగన్ వచ్చి మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చిన వెంటనే తిరిగి ఎకరం భూమి నలభై లక్షల రూపాయలకు చేరింది.దీంతో ఈ ప్రాంత వాసులు ముఖ్యమంత్రిగా చంద్రబాబు తిరిగి ఎన్నికయ్యేందుకు దోహదపడ్డారు. వారి ఆందోళనలు ఒకరకంగా పార్టీకి అనుకూలంగా మారాయి. అయితే చంద్రబాబు వచ్చిన తర్వాత అనుసరిస్తున్న పద్ధతులు, వరసగా భూ సమీకరణలు చేస్తుండటంతో మళ్లీ రియల్ ఎస్టేట్ స్తబ్దత నెలకొనిందంటున్నారు. గతంలో హైదరాబాద్ నుంచి వచ్చిన కొందరు రియల్ వ్యాపారులు ఇక్కడకు వచ్చి భూములు కొనుగోలు చేసి వెంచర్లను ఏర్పాటు చేశారు. కొందరు అపార్ట్ మెంట్లు నిర్మించారు. నేడు అపార్ట్ మెంట్ల ధరలు కూడా గతంలో మాదిరిగా లేవంటున్నారు. గతంలో అమరావతి రాజధాని హైప్ చూసి భూమిని కొనుగోలు చేసిన వారు ఇప్పుడు అమ్మాలన్నా కొనేవారు లేరని వాపోతున్నారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం : డా. చప్పిడి !



కాకినాడ రూరల్, డిసెంబర్ 11( శ్రీచక్ర) రైతు సంక్షేమమే కోటం ప్రభుత్వం ప్రధాని టిడిపి నేత డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారంకాకినాడ రూరల్ కరప మండలం యండమూరు పంచాయతీ వడ్డిపాలెం గ్రామానికి చెందిన వనుం విమళావతి ఇటీవల కూటమి ప్రభుత్వం నియమించిన ఆత్మ కమిటీ డైరెక్టర్ గా నియమితులు అయిన సందర్భంగా ఈ పదవి రావడానికి సహాయపడిన రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డా. చప్పిడి వెంకటేశ్వరరావు ను కలిసి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా డా. చప్పిడి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రతి కార్యకర్తను గుర్తిస్తుందని ఒక క్రమశిక్షణ కలిగిన పార్టీ తెలుగుదేశం అని అన్నారు మన రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తున్నారని అలాగే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీ వ్యవస్థను ఇంకా అభివృద్ధి చేసే దిశగా ఇంకా ఎన్నో మంచి మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు కూటమి ప్రభుత్వం ప్రజాసేవ కోసం అహర్నిశలు పాటుపడుతుందని అన్నారు అలాగే కాకినాడ రూరల్ నియోజకవర్గం శాసనసభ్యులు పంతం నానాజీ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపునిస్తూ పాలన సాగిస్తున్నారని అందులో భాగంగా ఆత్మ కమిటీని నియమించి చైర్మన్ గా గొల్లపల్లి చంద్రశేఖర్ ను నియమించి 21 మంది డైరెక్టర్లను కూడా నియమించడం జరిగిందని ఈ డైరెక్టర్లలో యండమూరు పంచాయతీ వడ్డిపాలెం గ్రామానికి చెందిన వనుం విమలావతిని డైరెక్టర్ గా నియమించడం జరిగిందని. ఈ పదవి ద్వారా రైతులకు అందుబాటులో ఉంటూ వారికి వ్యవసాయంలో ఎటువంటి పద్ధతులు తీసుకోవడం ద్వారా ఎక్కువ దిగుబడి పొందవచ్చు వంటి కార్యక్రమాలను, వ్యవసాయంలో నూతన పద్ధతులను, ఆఖ్వారంగంలో నూతన పద్ధతులను ఇలా అనేక వ్యవసాయ అనుబంధ సంస్థలకు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలలో ఆత్మ కమిటీ ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం విమళావతి మాట్లాడుతూ ఈ పదవి ద్వారా రైతులకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సేవా కార్యక్రమాలు చేపడతామని, అలాగే ఈ బాధ్యతను అప్పగించిన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కి, డా. చప్పిడి వెంకటేశ్వరరావుకి, గ్రామ సర్పంచ్ మారెళ్ల శివకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ మెంబర్ మద్దా వికాష్, అలయన్స్ క్లబ్స్ సౌత్ మల్టీఫుల్ ట్రెజరర్ వనుం శ్రీనివాస్ వనుం ఏడుకొండలు, కురుపూడి విజయతార,వనుం ఉపేంద్రనాథ్,వనుం అనంత రాజ్యలక్ష్మి, మేడిశెట్టి పాండురంగ, గుబ్బల వీరబాబు, పిల్లి లోవరాజు, పాలిక చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్రపురం నియోజవర్గంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ

### రోడ్లు నిర్మాణానికి రూ. 22.22 కోట్లు మంజూరు
### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడి

రామచంద్రపురం, డిసెంబర్ 11( శ్రీచక్ర)రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో రామచంద్రపురం నియోజక వర్గంలోని పలు మారుమూల ప్రాంతాల్లో లింక్ రోడ్లకు మోక్షం కలగనుంది. రామచంద్రపురం నియోజవర్గంలో రామచంద్రపురం, కాజులూరు, కె. గంగవరం మండలాల్లోని 13 రోడ్లు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ ద్వారా రూ. 22.22 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి నట్లు మంత్రి సుభాష్ కార్యాలయం ఒక ప్రకటనలో లో పేర్కొన్నారు గడచిన 18 నెలల కూటమి ప్రభుత్వ హయాంలో సుమారు 150 కోట్లతో నియోజవర్గాన్ని అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం మంజూరైన నిధులతో కాజులూరు మండలంలో రూ. 15.97 కోట్లతో తొమ్మిది రోడ్లు, కె.గంగవరం మండలంలో రూ. 4.76 కోట్లతో మూడు రోడ్లు, రామచంద్రపురం లో ఒక రోడ్డు రూ. 1.49 కోట్లు దీంతో వెరసి మొత్తం రూ. 22.22 కోట్లు వెచ్చించి రోడ్లు నిర్మించనున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో గుంతల మయంగా, అధ్వానంగా తయారైన రోడ్లను కూటమి ప్రభుత్వం దప దఫాలుగా బాగు చేస్తున్న సంగతి ప్రజలకు తెలిసిందే. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రోడ్ల నిర్మాణం పై ప్రత్యేక శ్రద్ధ కనబరచి ఈ నిధులు మంజూరు చేశారు. ఈ రోడ్ల నిర్మాణంతో నియోజవర్గంలో రోడ్లు దాదాపు కొత్త రూపు సంతరించుకుంటాయని భావిస్తున్నారు. రామచంద్రపురం నియోజవర్గానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ. 150 కోట్లు నిధులుతో అభివృద్ధి చేయడం మంత్రి సుభాష్ చేస్తున్న కృషి, పట్టుదల పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంజూరైన రోడ్లు ఇవే... కాజులూరు మండలంలో ఆంద్రంగి నుంచి దుగ్గుదూరు 6.262 కిలోమీటర్ల రోడ్డు రూ. 4.90 కోట్లు, ఆర్యవటం నుంచి వయా జగన్నాథగిరి , టి.మామిడాడ ,తర్లంపూడి 6.262 కిలోమీటర్ల రోడ్డు రూ. 2.61 కోట్లు, తుమ్మలపల్లి లంక నుంచి ముతుకుమిల్లి వయా ఆర్యవటం బంధనపూడి 4.931 కెఎం రోడ్డు రూ. 2.51 కోట్లు, గొప్పిరేవు నుంచి పల్లిపాలెం వరకు వయా నామవానిపాలెం 3.232 కిమీ రోడ్డురూ. 1.78 కోట్లు, కోలంక టు చలివేంద్రపాడు 2.717 కిమీ రోడ్డు రూ. 1.14 కోట్లు, కోలంక నుంచి పెదలంక 2.415 కిమీ రోడ్డు 0.49 లక్షలు, అలాగే పల్లిపాలెం నుంచి ఎర్రగుంట పేట 1.228 కిమీ రోడ్డు 0.68 లక్షలు, వై డి రోడ్ నుంచి పొలమూరు పాడు 0.847 మీ రోడ్డు రూ. 0.47 లక్షలుతో మొత్తం రూ. 15.97 కోట్లతో రోడ్లు నిర్మించనున్నారు. అలాగేరామచంద్రపురం మండలంలో కేఎన్ఎఫ్ ( కాకినాడ నర్సాపురం పెర్రి రోడ్డు ) నుంచి వెంకటాయపాలెం టు గణపతి నగరం 2.622 కిమీ రూ. 1.49 కోట్లు.కె గంగవరం మండలంలో కే ఎన్ ఎఫ్ రోడ్ నుంచి సుందరపల్లి వయా కొత్తపేట 3.289 కిమీ రోడ్డు రూ. 1.92 కోట్లు, పేకేరు నుంచి పొలమూరు పాడు నుండి దుగ్గుదూరు 2.686 కిమీ రోడ్డు రూ. 1.48 కోట్లు, ఆర్ అండ్ బి రోడ్డు నుంచి కొత్తకొంపలు వయా కుడుపూరు సావరం 2.475 కిమీ రోడ్డు రూ. 1.36 కోట్లు వెరసి మొత్తం రూ. 22.22 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడతామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు .ప్రజల మౌలిక సదుపాయాలైన రోడ్ల నిర్మాణం, త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణాల కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు వెచ్చిస్తుందని మంత్రి శుభాష్ సందర్భంగా పేర్కొన్నారు.



# కాకినాడ జిల్లాతోనే రామచంద్రపురం నియోజకవర్గ మనుగడ

### అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ-పోస్ట్ కార్డు ఉద్యమం







రామచంద్రపురం, డిసెంబర్ 11( శ్రీచక్ర)రామచంద్రపురం నియోజకవర్గం పరిధిలో గల కే. గంగవరం, రామచంద్రపురం రూరల్,మున్సిపాలిటీలను కాకినాడ జిల్లాలో కలపటం ద్వారానే నియోజకవర్గానికి భవిష్యత్తు ఉంటుందని రామచంద్రపురం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట రామచంద్రపురం అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణతో పాటు పోస్ట్ కార్డులో ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లాలో రామచంద్రపురం నియోజకవర్గాన్ని విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు విశేష స్పందన వచ్చిందని జేఏసీ కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కోకన్వీనర్ బత్తుల సిద్ధూలు పేర్కొన్నారు. ఈమఘురకు గురువారం వీరు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల దీర్ఘకాలిక డిమాండ్‌ను నిర్లక్ష్యం చేస్తోందని, గత ఐదు నెలల ఉద్యమాలు, 52 గ్రామ పంచాయతీలు, రెండు మండల ప్రజా పరిషత్, రామచంద్రపురం మున్సిపాలిటీ తీర్మానాలను పట్టించుకోకపోవడం దౌర్భాగ్యకరమని విమర్శించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ సుముఖత చూపకపోవడం ప్రజలను నిరాశ పరుస్తోందని అన్నారు. కాకినాడ జిల్లాలో విలీనం చేయకపోతే రామచంద్రపురం,కే. గంగవరం మండలాలు దిక్కులేనివిగా మారే ప్రమాదం ఉందని, రెవెన్యూ డివిజన్ కూడా క్రమంగా అదృశ్యం అయ్యే అవకాశముందని జేఏసీ ఈసందర్భంగా హెచ్చరించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేసినట్లు ప్రకటించాలని, లేనిపక్షంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల తీర్పు తీవ్రంగా ఉంటుందని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. రెవెన్యూ డివిజన్ కంటే జిల్లాలో విలీనం ఉత్తమ పరిష్కారం అని, అలా చేస్తే కాకినాడ ప్రజలకు చేరువ అవడంతో పాటు రామచంద్రపురం డివిజన్ కూడా శాశ్వతంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలంతా కాకినాడ జిల్లా కావాలని ముక్తకంఠంతో కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు దోమ్మలపాటి సత్యనారాయణ, రైతు కూలీ సంఘం నాయకులు వెంటపల్లి భీమశంకరం, ఐఎఫ్టియు నాయకులు చింతా రాజారెడ్డి, కాపవరం నాయకులు విష్ణు, షేక్ వల్లి, లాయర్స్ గంగాధర్, శేషు, కె. సత్యనారాయణ, షేక్ శ్రీనివాస్, వికలాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు పలివెల రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆనంద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ మరో గ్రేటర్ పరిధి


విశాఖపట్టణం, డిసెంబర్ 11, విశాఖ పై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. జగన్ సర్కార్ విశాఖను పాలన రాజధానిగా ప్రకటించింది. కానీ ఎటువంటి అభివృద్ధి చేయలేదు. రుషికొండపై భవనాలు నిర్మించింది. కానీ అవి ఎందుకు నిర్మించిందో మాత్రం చెప్పలేదు. కూటమి ప్రభుత్వం అలా కాదు. విశాఖ నగరానికి పెద్ద ఎత్తున ఐటీ పరిశ్రమలను తెస్తోంది. మిగతా ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు అవుతున్నాయి. ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుంది. అనుబంధ పరిశ్రమలు సైతం పెద్ద ఎత్తున తరలివస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో విశాఖ నగరాన్ని మరింత విస్తరించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ తరహాలో బల్దియా చేయాలనుకుంటోంది. తాజాగా వివిధ నియోజకవర్గాల్లో ఉన్న 70 పంచాయితీలను మహా విశాఖ నగరపాలక సంస్థలు విలీనం చేసేందుకు నిర్ణయం తీసుకుంది. విశాఖ నగర ప్రస్థానం చూస్తే మాత్రం క్రమేపి ఎదుగుతూ వస్తోంది. అయితే వైసిపి హయాంలో జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టిపెట్టారు విశాఖపట్నం పై.. అయితే అది అభివృద్ధి పరంగా రాజకీయంగా తన ముద్ర చాటుకునేందుకు విశాఖను వేదికగా చేసుకున్నారు. ఎప్పుడు హడావిడితో నడిచేది వైసిపి హయాంలో విశాఖ నగరంలో. ప్రాంతీయ సమన్వయకర్తలతో పాటు వైసీపీ నేతల తాకిడి అధికంగా ఉండేది. దీంతో నగరవాసులు ఒక రకమైన ఆందోళన కనిపించేది. ఆ హడావిడి కి తగ్గట్టు ఎటువంటి అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు.. పైగా కొంతమంది వైసీపీ నేతలపై పెద్ద ఎత్తున భూకబ్జా ఆరోపణలు వచ్చాయి. ఆంధ్ర యూనివర్సిటీ భూముల్లో ప్రైవేట్ సంస్థల ఎంట్రీ అప్పట్లో జరిగింది. ఈ పరిణామాల క్రమంలో విశాఖ ప్రజలు చాలా ఆందోళనకు గురయ్యారు. అభివృద్ధి జరగకపోగా నగరంలో ఈ గందరగోళ పరిస్థితులు ఏమిటి అని ఎక్కువమంది ప్రశ్నించారు. మొన్నటి ఎన్నికల్లో విశాఖలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి ప్రజల్లో ఉన్న ఆందోళన కారణం. దానిని గుర్తించింది కూటమి ప్రభుత్వం. ఎటువంటి ఆర్భాటాలకు పోకుండా విశాఖను ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం విశాఖలో ఉన్న ప్రాంతాలన్నింటినీ గ్రేటర్ పరిధిలోకి తెచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. ఇటు భీమిలి, అటు గాజువాక, పెందుర్తి పరిధిలో ఉన్న అన్ని పంచాయితీలు గ్రేటర్లో విలీనం కానున్నాయి. ఇటీవల పంచాయతీలు చేర్పుల మార్పులకు సంబంధించి ప్రభుత్వం ఉన్న నిషేధాన్ని తొలగించింది. దీంతో టీడీపీ ఎమ్మెల్యేలు ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి ఇచ్చారు. పంచాయితీ ఎన్నికల నిర్వహణకు ముందే ఈ 70 పంచాయితీలు గ్రేటర్ పరిధిలోకి రానున్నాయి.

# అధిక కొలెస్ట్రాల్‌లను సహజంగా తగ్గించే ఆయుర్వేద మూలికలు.. ఒక్కసారి వాడితే చాలు!



కొలెస్ట్రాల్ సమస్య ప్రస్తుతం చాలా మందిని వేధిస్తున్న సమస్య. ఆధునిక జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతున్నాయి. కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువ అయ్యేకొద్దీ హృద్రోగాలు, రక్తనాళ సమస్యలు వంటి ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉంది. అయితే, కొలెస్ట్రాల్ నియంత్రణకు పాశ్చాత్య ఔషధాలను మాత్రమే కాదు, ఆయుర్వేదంలో అందుబాటులో ఉన్న ప్రకృతి మూలికలను కూడా ఉపయోగించవచ్చు. ఇవి సహజంగా శరీరానికి హానికరం కాకుండా ఉపయోగపడతాయి. కొలెస్ట్రాల్ సమస్యను నివారించడానికి ,తగ్గించడానికి ఆయుర్వేదం అనేక మూలికలను సూచిస్తారు. ఈ మూలికలు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో మాత్రమే కాకుండా మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయి. 1. అర్జున: అర్జున శక్తివంతమైన ఆయుర్వేద మూలిక. ఇది గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో కూడా ఇది సహాయపడుతుంది.ఈ మూలిక రక్తంలోని చెడు కొలెస్ట్రాల్ (ఒఆఒ)ను తగ్గించడంలో సహాయపడుతుంది. అరట పొడి ను నీటిలో కలిపి త్రాగడం లేదా అరటతో చేసిన చూర్ణాన్ని రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ఉపయోగకరం. "కోడిగుడ్డుతో పాటు వీటిని అస్సలు తినొద్దు.. తిన్నారో..? " 2. గుగ్గిలం గుగ్గిలం పూజలో దూపం వేయడానికి ఎక్కువగా వాడుతూ ఉంటాం. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో చాలా ప్రభావవంతంగా పని చేస్తుంది. గుగ్గులు ( గుగ్గిలం) అనేది ప్రాచీన ఆయుర్వేద ఔషధం, ఇది చెడు కొలెస్ట్రాల్ తగ్గించడంలో అద్భుతంగా పని చేస్తుంది. ఇందులో గుగ్గులస్టెరాన్ అనే రసాయనాలు ఉండి రక్త నాళాలలో కొవ్వు పేరుకుపోవడం తగ్గిస్తాయి. గుగ్గులతో చేసిన క్యాప్సూల్స్ లేదా చూర్ణం తీసుకోవచ్చు. 3. మెంతులు ( మెంతులలో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఇది రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించడంలో సహాయపడుతుంది. మెంతులను రాత్రి నీటిలో నానబెట్టి, ఉదయం త్రాగడం లేదా మెంతి పొడి తీసుకోవడం మంచి పరిష్కారం. 4. తులసి తులసి ఆకులు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండెకు మంచి ఆరోగ్యం కలిగిస్తాయి. తులసి ఆకులను ఉదయాన్నే ఖాళీ కడుపుతో తినడం లేదా తులసి టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. "నిద్రలేవగానే ఈ పనులు చేస్తే రోగాలకు వెల్కమ్ చెప్పినట్టే!" 5. హరితకీ హరితకీ ( కరక్కాయ ) శరీరంలోని టాక్సిన్లను తొలగించి, కొలెస్ట్రాల్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది. హరితకీ చూర్ణం నీటిలో కలిపి తీసుకోవడం లేదా హరితకితో చేసే ఆయుర్వేద ఔషధాలు ఉపయోగించవచ్చు. 6. వెల్లుల్లి వెల్లుల్లిలో ఉన్న అలిసిన్ రసాయనం రక్తనాళాల ఆహారాన్ని మెరుగుపరచడంలో, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. రోజూ 1-2 వెల్లుల్లి రెబ్బలను తినడం లేదా నీటిని త్రాగడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. 7. త్రిఫలఅనే మూడు మూలికల మిశ్రమం. ఇది రక్తంలో కొవ్వు పేరుకుపోవడం తగ్గించడంలో అద్భుతమైన పరిష్కారం. త్రిఫలాను రోజూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్తనాళాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. "పొద్దుతిరుగుడు నూనెను వంటల్లో వాడుతున్నారా? ఇది ఆరోగ్యానికి మంచిదేనా?" సహజ మార్గంలో కొలెస్ట్రాల్ తగ్గించడానికి చిట్కాలు ఈ ఆయుర్వేద మూలికలతో పాటు సమతుల ఆహారం తీసుకోవాలి. రోజూ వ్యాయామం చేయడం ముఖ్యం. ఫ్రైడ్ , ప్రాసెస్డ్ ఫుడ్స్‌కు దూరంగా ఉండండి. నీటిని ఎక్కువగా త్రాగడం, స్ట్రెస్ నియంత్రణ చేసుకోవడం శరీరానికి ఆరోగ్యకరం.

# పనస కాయ బిర్యానీ తింటున్నారా?



బిర్యానీలన్నీ సాధారణంగా నాన్ వెజ్ తో తయారవుతుంటాయి. వెజ్ బిర్యానీ చేసుకునేవారు కూడా ఉన్నారు. ఈ బిర్యానీలన్నీ ఒక ఎత్తయితే పనస కాయ బిర్యానీ మరో ఎత్తు. ఏపీ, తెలంగాణలో పనస కాయ బిర్యానీకి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇదంటే మెడ కోసుకునేవారు కూడా ఉన్నారు. చాలా విభిన్నమైన బిర్యానీయేకాదు.. విభిన్నమైన రుచితో ఉంటుంది. తింటే అసలు వదిలిపెట్టరు. ఇది మంచి ఆరోగ్యాన్ని ఇస్తుంది. దీన్ని ఎలా తయారుచేసుకోవాలో తెలుసుకుందాం. పనసకాయ బిర్యానీ తయారీకి కావలసిన పదార్థాలు "దొంగచూపులు ఎక్కువగా చూస్తున్నారా?" పనసకాయ ముక్కలు బాస్మతి బియ్యం ఉల్లిపాయలు పచ్చిమిర్చి కొత్తిమీర పుదీనా దాల్చిన చెక్క లవంగాలు యాలకులు జీలకర్ర గరం మసాలా పసుపు పొడి కారం పొడి ఉప్పు నూనె పెరుగు నిమ్మరసం తయారు చేసే విధానం పనసకాయ ముక్కలను నూనెలో వేయించి, అదనపు నూనె తీసేయాలి. బాస్మతి బియ్యాన్ని నీరు, ఉప్పు వేసి ఉడికించి, నీరు పూర్తిగా తగ్గిన తర్వాత వడకట్టి చల్లబరచాలి. తర్వాత ఒక పాత్రలో నూనె వేసి వేడి చేసి, దాల్చిన చెక్క, లవంగాలు, యాలకులు, జీలకర్ర వేసి వేగించిన తర్వాత వాటిలో తరిగిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేసి మరికొంత సమయం వేయించాలి. పసుపు పొడి, కారం పొడి, గరం మసాలా వేసి బాగా కలపాలి. వేయించిన పనసకాయ ముక్కలను, మసాలా మిశ్రమం, పెరుగు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. తర్వాత ఒక పాత్రలో బియ్యం, పనసకాయ మిశ్రమం పొరలు పొరలుగా అమర్చండి. తర్వాత వాటిపై మూత పెట్టి సన్నటి సెగ కాకుండా, పెద్ద సెగ కాకుండా ఉండే మంటపై 15-20 నిమిషాలు ఉంచాలి. వేడి వేడిగా కొత్తిమీర, పుదీనా తరుగుతో అలంకరించి సర్వ్ చేయండి. "జుట్టు ఊడిపోకుండా ఉండాలంటే ఇలా చేయండి!" చిట్కాలు పనసకాయను కొద్దిగా ఉప్పు వేసి ఉడికించి తర్వాత వేయించడం వల్ల మృదువుగా ఉంటుంది. బాస్మతి బియ్యాన్ని కొద్దిగా నీరు వేసి ఉడికించడం వల్ల బిర్యానీ మరింత రుచికరంగా వస్తుంది. దీంతోపాటు పెరుగు కూడా మరింత రుచిని ఇస్తుంది. బిర్యానీని చాలా మృదువుగా మారుస్తుంది. మీకు ఇష్టం ఉంటే దానిపై కేసరి వేసి అలంకరించుకోండి. బయట మార్కెట్ లో దొరుకుతుంది.

# రొయ్యల ఇగురులో ఇది కలపండి... మొత్తం ఊడ్చేస్తారు!

రొయ్యలు అంటేనే ఆరోగ్యానికి ఎంతో మంచివి. దీన్ని తయారుచేసుకునే సమయంలో పాలకూర కలిపితే రుచి అమోఘంగా ఉంటుంది. రొయ్యలతో పాలకూర కలయిక అద్భుతమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. దీన్ని తయారుచేయడం కూడా ఎంతో సులువు. దీన్ని ఎంతో రుచిగా ఎలా చేయాలో తెలుసుకుందాం. కావల్సిన పదార్థాలు రొయ్యలు - 1/2 కిలో పాలకూర - 1 పట్టీ ఉల్లిపాయలు - 2 తోటకూర - కొద్దిగా ఆవాలు - 1/2 టీస్పూన్ "ఈ నూనెలు కలిపి రాయండి... జుట్టు తాటిచెట్టులా పెరుగుతుంది!" జీలకర్ర - 1 టీస్పూన్ కొత్తిమీర - కొద్దిగా పసుపు పొడి - 1/2టీస్పూన్ కారం పొడి - రుచికి తగినంత కొబ్బరి పొడి - 2 టేబుల్ స్పూన్లు ఉప్పు - రుచికి తగినంత నూనె - వేయడానికి తగినంత తయారు చేసే విధానం



రొయ్యలను బాగా శుభ్రం చేసి, తలలు, తోకలు తొలగించి, చిన్న చిన్న ముక్కలుగా కోసుకోండి. తర్వాత పాలకూరను బాగా శుభ్రం చేసి, చిన్న చిన్న ముక్కలుగా కోసుకోవాలి. అలాగే తోటకూరను కూడా శుభ్రం చేసి కోసుకోండి. ఉల్లిపాయలను చిన్న చిన్న ముక్కలుగా తరిగి పెట్టుకోండి. మసాలా తయారీ ఒక మిక్సీ జార్ లో కొబ్బరి పొడి, పసుపు పొడి, కారం పొడి, కొద్దిగా ఉప్పు వేసి మెత్తగా అరగదీసుకోవాలి. ఒక పాత్రలో నూనె వేసి వేడి చేయండి. ఆవాలు, జీలకర్ర వేసి పచార్లు వచ్చే వరకు వేయించిన తర్వాత తరిగిన ఉల్లిపాయలు వేసి వేగించండి. ఉల్లిపాయలు బంగారు రంగులోకి మారిన తరువాత, కోసిన పాలకూర, తోటకూర వేసి బాగా వేగించాలి. ఇప్పుడు ముందుగా తయారు చేసిన మసాలా పొడిని వేసి బాగా కలపాలి. శుభ్రం చేసిన రొయ్యలను వేసి బాగా కలపాలి. రొయ్యలు బాగా ఉడికే వరకు వేయించండి. అవసరమైతే కొద్దిగా నీరు వేసి మరిగించండి. చివరగా కోసిన కొత్తిమీర వేసి కలపి.. వేడి వేడిగా అన్నం లేదా రోటీతో సర్వ్ చేయండి. ఒకవేళ మీకు ఇష్టమైతే కొద్దిగా కష్టాయం వేసుకొని వేయించుకోవచ్చు. రుచికి తగినట్లుగా ఉప్పు, కారంపొడి వాడాలి. వాడేటప్పుడు పాలకూర కానీ, రొయ్యలుకానీ తాజాగా ఉండేలా చూసుకోండి.

# బీరకాయలతో ఆరోగ్యానికి బోలెడు లాభాలు!



చాలామంది బీరకాయలను అంత ఇష్టంగా తినరు. కానీ బీరకాయలు మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తాయి. బీరకాయలలో ఉండే పోషకాలు మన శరీరానికి కావలసిన శక్తిని ఇస్తాయి. బీరకాయలలో కొవ్వు తక్కువగా ఉంటుంది. నీరు, ఫైబర్ ఎక్కువగా ఉండి పోషకాలు కూడా ఎక్కువగా ఉండటం వల్ల బీరకాయ ఆరోగ్యానికి చాలా మంచి చేస్తుంది. బీరకాయలలో ఫుల్ పోషకాలు బీరకాయలలో విటమిన్ ఏ, విటమిన్ సి, మెగ్నీషియం, విటమిన్ బీ 6, పొటాషియం, సోడియం, ఐరన్, జింక్, కాపర్, థయామిన్ వంటి పోషకాలు ఉంటాయి. ఈ పోషకాలు మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తాయి. ఇక బీరకాయ తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ప్రస్తుతం తెలుసుకుందాం. "రొయ్యల ఇగురులో ఇది కలపండి... మొత్తం ఊడ్చేస్తారు!" బీరకాయలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు బీరకాయలో ఉండే పోషకాలు మన శరీరంలోని వ్యర్థాలను తొలగించి రక్తాన్ని శుద్ధి చేస్తాయి. బీరకాయ లివర్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బీరకాయలో ఉండే పుష్కలమైన విటమిన్ సి, ఐరన్, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాల కారణంగా ఇవి మన రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. శరీరంలో ఇన్ఫ్లమేషన్ తగ్గించడానికి దోహదం చేస్తాయి. బీరకాయలో ఉండే పీచు పదార్థాల వల్ల మన జీర్ణ వ్యవస్థ బాగుపడుతుంది. బీరకాయలతో ఈ సమస్యలకు చెక్ ఇక బీరకాయలో ఉండే ఐరన్, ఐరన్ లోపం ఉన్నవారిలో వచ్చే రక్తహీనత సమస్యను తగ్గిస్తుంది. శరీరంలోని అన్ని అవయవాలకు రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది. నొప్పి, అలసట వంటి లక్షణాలను లేకుండా చేస్తుంది. బీరకాయలలో డైటరీ ఫైబర్ మెండుగా ఉండటం వల్ల మలబద్ధకంతో బాధపడే వారికి ఆ సమస్యను బీరకాయ తగ్గిస్తుంది. బీరకాయలో పొటాషియం, మెగ్నీషియం పుష్కలంగా ఉండడం వల్ల మన గుండె పనితీరును ఇది మెరుగుపరుస్తుంది. ఖనీలివతీవట ఃఎ ఒబేసిటీతో పాటు డయాబెటిస్ కు బీరకాయతో చెక్ బీరకాయలో ఉండే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ తో పోరాడి మన గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. బీరకాయలో ఉండే విటమిన్ బి 5 మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తుంది. బీరకాయ బరువు తగ్గడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. బీరకాయల్లో ఉండే పోషకాల కారణంగా డయాబెటిస్ కూడా కంట్రోల్ లో ఉంటుంది. రక్తంలో మాత్రమే కాదు మూత్రంలో కూడా చక్కెర నిల్వల శాతాన్ని తగ్గించేందుకు బీరకాయ దోహదం చేస్తుంది. "భోజనం తర్వాత సోంపు గింజలు నమిలి తింటున్నారా?" బీరకాయలతో ఆరోగ్యం మెండు బీరకాయలలో ఉండే విటమిన్ ఏ మన కళ్ళకు ఆరోగ్యాన్ని ఇస్తుంది. బీరకాయ అల్సర్లతో బాధపడే వారికి శరీరంలోని వేడిని తగ్గించే కూలింగ్ ఏజెంట్ గా పనిచేస్తుంది. మూత్ర విసర్జన సమయంలో వచ్చే మంటను కూడా బీరకాయ తగ్గిస్తుంది. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలు చేకూర్చే బీరకాయలను ఆహారంలో భాగంగా చేసుకుంటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు మెండు. కనుక మరెందుకు ఆలస్యం బీరకాయలలో ఉన్న బోలెడు ఆరోగ్య ప్రయోజనాలను గురించి తెలుసుకున్న తర్వాత నాకొద్దు అనకుండా ప్రతి ఒక్కరు బీరకాయలను తినండి.

# ఏ వయస్సులో ప్రెగ్నెంట్ అవ్వాలో తెలుసా..?

గర్భధారణకు అత్యంత అనువైన వయస్సు గురించి ఒక నిర్దిష్ట సమాధానం చెప్పడం కష్టం. ఎందుకంటే ప్రతి స్త్రీ శరీరం ప్రత్యేకంగా ఉంటుంది మరియు ఆరోగ్యం, జీవనశైలి వంటి అనేక అంశాలు దీనిపై ప్రభావం చూపుతాయి.సాధారణంగా, 20 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల స్త్రీలకు గర్భధారణ ఆరోగ్యకరంగా ఉంటుందని భావిస్తారు. ఈ కాలంలో శరీరం సాధారణంగా ఆరోగ్యంగా ఉండి, గర్భధారణను మరింత సులభంగా భరిస్తుంది. అయితే, ఈ వయస్సు మాత్రమే సరైనది అని చెప్పలేము. కొన్ని సందర్భాల్లో శరీరం పూర్తిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.గర్భధారణ సమయంలో కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు, గర్భస్రావం, ప్రీక్లాంప్సియా వంటివి. " శృంగారంలో తరచూ పాల్గొన్నా పిల్లలు పుట్టడం లేదా ? " గర్భధారణకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు: గర్భధారణకు ముందు ఒకసారి పూర్తి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యం. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, తగినంత నిద్ర పోవడం వంటివి ముఖ్యం.గర్భధారణ గురించి మీ వైద్యునితో మాట్లాడి, వారి సలహా మేరకు వ్యవహరించండి. ముఖ్యంగా గమనించాల్సిన విషయం: వయస్సుతో పాటు, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు, జీవనశైలి వంటి అనేక అంశాలు గర్భధారణను ప్రభావితం చేస్తాయి. గర్భధారణ గురించి ఏదైనా సందేహం ఉంటే, వెంటనే మీ వైద్యునిని సంప్రదించండి.గర్భధారణ ఒక మహిళ జీవితంలో అత్యంత ముఖ్యమైన దశ. కాబట్టి, ఈ నిర్ణయం తీసుకునే ముందు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యం.





# స్పోర్ట్స్ న్యూస్

## నేడు ముల్లాన్‌పూర్‌లో భారత్-దక్షిణాఫ్రికా మధ్య రెండో టీ20.. తుది జట్టులో మార్పులు చేస్తారా..?




భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో రెండో మ్యాచ్ గురువారం జరగనుంది. తొలి టీ20లో భారత్ బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ అద్భుతమైన ప్రదర్శన చేసి, ఏకపక్ష విజయం సాధించి సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. తాజాగా ఈ మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌లో ఆధిక్యం సాధించాలని భావిస్తున్నది. అదే సమయంలో తొలి విజయం నమోదు చేసి సమం చేయాలని ప్రొటీస్ జట్టు కసితో ఉన్నది. ఈ మ్యాచ్‌లో భారత జట్టు తొలి టీ20లో ఆడిన జట్టుతోనే బరిలోకి దిగే అవకాశం ఉంది. సాధారణంగా గెలిచిన కాంబినేషన్‌ను మార్చేందుకు ఏ జట్టు అంతగా ఇష్టపడదు.మరి రెండో టీ20లో భారత్ ఈ రిస్క్ తీసుకుంటుందా? లేదా? చూడాల్సిందే. తొలి టీ20 కోసం భారత్ వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, సంజు శాంసన్, హర్షిత్ రాణాలను టీమ్ మేనేజ్‌మెంట్ పక్కన పెట్టింది. శాంసన్‌ను పక్కనపెట్టి జితేష్ శర్మకు ప్రాధాన్యం ఇవ్వడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. మొన్నటి వరకు టీ20 జట్టులో శాంసన్ రెగ్యులర్ ఆటగాడు. అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించాడు. అయితే, శుభ్‌మన్ గిల్ రాకతో ఓపెనింగ్ నుంచి మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు దిగాల్సి వచ్చింది. దాంతో మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేయడంలో విఫలమయ్యాడు.ఇక దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో గాయపడ్డ గిల్.. టీ20ల్లోకి ఎంట్రీ ఇచ్చాడు. తొలి టీ20లో నాలుగు పరుగులకే పెవిలియన్‌కు చేరి నిరాశ పరిచాడు. ఇటీవల కాలంలో గిల్ టీ20ల్లో విఫలమవుతూ వస్తున్నాడు. కటక్ టీ20లో తొలి ఓవర్‌లోనే గిల్ అవుట్ కావడంతో భారత బ్యాట్స్‌మెన్‌పై ఒత్తిడి పెరిగింది. ఇక చండీగఢ్‌లో జరిగే రెండో టీ20లోనైనా రాణించాలని మెరుగ్గా రాణిస్తాడని భావిస్తున్నారు. టెస్ట్, వన్డే కెప్టెన్ అయిన గిల్ గత ఏడాది టీ20 ప్రపంచ కప్ వరకు విరాట్ కోహ్లీ పోషించిన పాత్రను సులభంగా పోషిస్తాడని భావిస్తున్నారు. భారత జట్టులో ఎనిమిదో నెంబర్ వరకు బ్యాటింగ్ ఆప్షన్స్ ఉన్నాయి. పవర్‌ప్లేలో అభిషేక్ శర్మలా గిల్ దూకుడుగా బ్యాటింగ్ చేయలేడని.. దాంతో తన పాత్రను ఎలా సమర్థవంతంగా పోషించాలని తెలుసుకోవాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిలో జరగబోయే టీ20 ప్రపంచ కప్‌కు ముందు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రదర్శన కూడా ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ కప్‌కు ముందు అతను ఫామ్‌లోకి రావడం భారత్‌కు చాలా కీలకం.న్యూ చండీగఢ్‌లోని చల్లని వాతావరణంలో జరిగే మ్యాచ్‌లో భారత జట్టు కాంబినేషన్‌లో ఎలాంటి మార్పులు చేసే అవకాశం లేదు. కటక్‌లో ఆడిన ప్లేయింగ్ ఎలెవన్‌నే ముల్లాన్‌పూర్‌లో కూడా భారత్ బరిలోకి దింపే అవకాశం ఉంది. గాయం నుంచి కోలుకుని జాతీయ జట్టులోకి తిరిగి వచ్చిన హార్దిక్ పాండ్యా మరోసారి తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. భారత జట్టుకు తన అవసరం ఏంటో చాటిచెప్పాడు. కటక్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో కష్టమైన పిచ్‌పై 28 బంతుల్లో చేసిన 59 పరుగులు చేశాడు. అలాగే, బంతితోనూ రాణించాడు. బ్యాటింగ్‌లో అజేయ హాఫ్ సెంచరీ చేయడంతో పాటు బౌలింగ్‌లో ఒక వికెట్ తీశాడు. హార్దిక్ టీ20 అంతర్జాతీయ మ్యాచుల్లో 99 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. ఈ ఫార్మాట్‌లో వంద వికెట్ల క్లబ్‌లో చేరేందుకు ఒకే వికెట్ దూరంలో ఉన్నాడు. రెండో టీ20లో హార్దిక్ ఒక వికెట్ తీస్తే.. టీ20ల్లో 100 వికెట్లు పూర్తి చేసిన టీమిండియా మూడో బౌలర్‌గా నిలుస్తాడు. ఇప్పటి వరకు ఈ జాబితాలో అర్ష్‌దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా ఉన్నారు.తొలి మ్యాచ్‌లో జట్టు కూర్పును బట్టి చూస్తే.. ఇద్దరు కీలక బౌలర్లు అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్ ఒకేసారి ప్లేయింగ్ ఎలెవన్‌లో భాగమయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. ఎందుకంటే జట్టు యాజమాన్యం ఎనిమిదో స్థానంలో బ్యాట్స్‌మెన్‌ను కోరుకుంటున్నది. తొలి మ్యాచ్‌లో అర్ష్‌దీప్‌కు అవకాశం లభించింది. ఈ ఫార్మాట్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ అర్ష్‌దీప్. జస్ప్రీత్ బుమ్రాతో కలిసి ఆరంభంలోనే వికెట్లు అందించాడు. ఇక ముల్లాన్‌పూర్ టీ20లో అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ (వికెట్ కీపర్), అక్షర్ పటేల్, జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్ ఆడే అవకాశం ఉన్నది.

## ఆమె వల్లే నేను రాణించాను: హార్దిక్ పాండ్యా

తన ప్రియురాలు మహికా శర్మ వల్లే సౌతాఫ్రికాతో తొలి టీ20లో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చానని టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తెలిపాడు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా మంగళవారం కటక్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 101 పరుగుల భారీ తేడాతో సౌతాఫ్రికాను చిత్తు చేసింది.176 పరుగుల లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా 74 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా(28 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 59 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించాడు. బౌలింగ్‌లోనూ ఒక వికెట్ తీసి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. టాపార్డర్, మిడిలార్డర్ విఫలమైన వేళ అద్భుత బ్యాటింగ్‌తో జట్టుకు భారీ స్కోర్ అందించాడు. ఈ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందుకున్నాడు.ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న హార్దిక్ పాండ్యా.. సానుకూల దృక్పథమే తనను తిరిగి మైదానంలో అడుగు పెట్టేలా చేసిందని తెలిపాడు. 'గాయం తర్వాత నేను మరింత దృఢంగా తిరిగి వచ్చాను. గాయాలు మనల్ని మానసికంగా పరీక్షిస్తాయి. బలంగా నిలబడటం వల్లే నాలో మరింత ఆత్మవిశ్వాసం పెరిగింది. నా మీద నాకు చాలా నమ్మకం ఉంది. నిజానికి మనల్ని మనం కచ్చితంగా నమ్మాలి.మనమీద మనకే విశ్వాసం లేనప్పుడు




ఇతరులు మనల్ని ఎలా నమ్ముతారు. మైదానంలో దిగిన ప్రతీ క్షణాన్ని, ఆటను ఆస్వాదించాలనుకున్నా. జనాలను ఆకట్టుకునేలా ఆడాలనుకోవడమే నాకు అసలైన ప్రేరణ. అలాగే నేను రాణించడానికి నా ప్రియురాలు కూడా ఓ కారణం. ఆమె నా జీవితంలోకి వచ్చిన తర్వాత చాలా మంచి జరిగింది.'అని హార్దిక్ పాండ్యా తన ప్రియురాలు మహికా శర్మ గురించి చెప్పుకొచ్చాడు.ముంబైలో కొందరు ఫొటోగ్రాఫర్లు మహికా శర్మను అసభ్యంగా ఫొటోలు తీయడంపై హార్దిక్ పాండ్యా ఆగ్రహం వ్యక్తం చేశాడు. మహిళలకు కనీస గౌరవం ఇవ్వాలని , ప్రతీ ఒక్కరికీ హద్దులుంటాయని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నాడు. మహికా శర్మ లోదుస్తులు కనిపించేలా ఫొటోలు, వీడియోలు తీయగా.. అవి నెట్టింట వైరల్‌గా మారాయి.

## గౌతమ్ గంభీర్‌పై షాహిద్ అఫ్రిది ఫైర్!

భారత క్రికెట్ జట్టులో వెటరన్ ఆటగాళ్ల కొనసాగింపుపై చర్చ జరుగుతున్న సమయంలో పాక్ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సిరీస్‌లలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల అద్భుత ప్రదర్శన తర్వాత షాహిద్ అఫ్రిది వారిని 2027 ప్రపంచ కప్ వరకు జట్టులో కొనసాగించాలని గట్టిగా వాదించారు. ఈ నేపథ్యంలో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. భారత వన్డే ప్రణాళికలకు ఈ ఇద్దరూ చాలా కీలకమని అభిప్రాయపడ్డారు.టీమిండియా ఈ ఇద్దరు దిగ్గజాలను తెలివిగా ఉపయోగించుకోవాలని అఫ్రిది సూచించారు. బలహీన జట్లతో ఆడేటప్పుడు వారికి విశ్రాంతి ఇచ్చి కీలక సిరీస్‌లలో వారిని ఆడించాలని చెప్పారు. "విరాట్, రోహిత్ భారత బ్యాటింగ్ లైనప్‌కు వెన్నెముక



అనే వాస్తవాన్ని అంగీకరించాలి. ఇటీవల వన్డే సిరీస్‌లలో వారు ఆడిన తీరు చూస్తే, వారు 2027 ప్రపంచ కప్ వరకు సులభంగా ఆడగలరని నమ్మకంగా చెప్పవచ్చు. మీరు ఈ ఇద్దరు స్టార్స్‌ను రక్షించుకోవాలి. భారతదేశం ఒక బలహీనమైన జట్టుతో ఆడుతున్నప్పుడు, కొత్త ఆటగాళ్లను ప్రయత్నించి, విరాట్, రోహిత్‌లకు విశ్రాంతి ఇవ్వవచ్చు." అని అఫ్రిది వ్యాఖ్యానించారు.గత కొన్నేళ్లుగా అఫ్రిది, గౌతమ్ గంభీర్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ ఆల్‌రౌండర్ భారత హెడ్ కోచ్‌ను విమర్శించడానికి వెనుకాడలేదు. గంభీర్ సారథ్యంలో టీమిండియా మిశ్రమ ఫలితాలను చవిచూసింది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్‌ను గెలిచినప్పటికీ, టెస్టుల్లో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా మరియు దక్షిణాఫ్రికా చేతుల్లో ఓటమిని ఎదుర్కొంది. "గౌతమ్ తన పదవీకాలాన్ని ప్రారంభించిన తీరు చూస్తే, తాను అనుకున్నది, తాను చెప్పింది మాత్రమే సరైనదని అతను భావించినట్లు అనిపించింది. కానీ కొంతకాలం తర్వాత, మీరు ఎల్లప్పుడూ సరైనవారు కారని నిరూపించబడింది." అని అఫ్రిది విమర్శలు గుప్పించారు.ఈ సందర్భంగా అఫ్రిది వన్డేల్లో అత్యధిక సిక్సర్ల రికార్డును బద్దలు కొట్టినందుకు రోహిత్ శర్మను అభినందించారు. ఐపీఎల్ 2009లో డెక్కన్ ఛార్జర్స్ తరఫున రోహిత్‌తో కలిసి ఆడిన అఫ్రిది, అప్పుడే రోహిత్ అంతర్జాతీయ క్రికెట్‌లో పెద్ద స్టార్ అవుతాడని తనకు తెలుసునని చెప్పారు. "రికార్డులు బద్దలు కొట్టడానికే ఉంటాయి, ఈ రికార్డు కూడా ఇప్పుడు మెరుగుపడింది.

## రోహిత్, కోహ్లీ శాలరీల్లో 2 కోట్ల కోత !




ముంబై: వివిధ కేటగిరీల్లోని క్రికెటర్లకు బీసీసీఐ ప్రతి ఏడాది శాలరీ చెల్లిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఏ ప్లస్ జాబితాలో ఉన్న క్రికెటర్లకు అత్యధికంగా ఏడు కోట్ల జీతం ఇస్తారు. సెంట్రల్ కాంట్రాక్టులో ఉన్న ఆటగాళ్ల జాబితాను ఏప్రిల్ 2025లో రిలీజ్ చేస్తారు. ఇక రాబోయే సంవత్సరానికి చెందిన కాంట్రాక్టు ఆటగాళ్ల జాబితాను కూడా త్వరలో రిలీజ్ చేయనున్నారు. ఏ ప్లస్ కేటగిరీలో జీతం తీసుకుంటున్న ప్రఖ్యాత క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలపై ప్రభావం పడే అవకాశం ఉన్నది. ప్రస్తుతం టెస్టులు, టీ20ల నుంచి ఆ ఇద్దరు మేటి క్రికెటర్లు తప్పుకున్నారు. వాళ్ల కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. దీని వల్ల సెంట్రల్ కాంట్రాక్టులోని కేటగిరీల్లో మార్పు జరిగే అవకాశం ఉన్నది.బీసీసీఐ నాలుగు కేటగిరీల ప్రకారం క్రికెటర్లకు జీతాలు చెల్లిస్తుంది. అత్యధిక శాలరీలు ఏ ప్లస్ కేటగిరీలో ఉన్న ఆటగాళ్లకు అందుతుంది. ఇక ఆ తర్వాత స్థానాల్లో ఏ, బీ, సీ కేటగిరీ క్రికెటర్లు ఉంటారు. ప్రస్తుతం కోహ్లీ, రోహిత్ శర్మ ఏ ప్లస్ కేటగిరీలో ఉన్నారు. కానీ ఇటీవల వాళ్లు టెస్టు, టీ20లకు దూరం కావడం వల్ల .. ఆ క్రికెటర్ల గ్రేడింగ్ తగ్గే అవకాశం ఉన్నది. ఏ ప్లస్ కేటగిరీ నుంచి ఆ ఇద్దరూ ఏ కేటగిరీలోకి ప్రవేశించే అవకాశాలు ఉన్నాయి. ఆ డిమోషన్ వల్ల వాళ్ల శాలరీల్లో ఒక్కొక్కరికి రెండు కోట్ల కోత పడే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. కాంట్రాక్టులో ఉన్న ప్లేయర్లకు.. మ్యాచ్‌ల సంఖ్యతో సంబంధం లేకుండా పేమెంట్ చేస్తారు. అయితే శాలరీకి అదనంగా మ్యాచ్ ఫీజును అందిస్తారు.ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఇటీవల టీ20 క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. కానీ అతను టెస్టు జట్టులో ఉన్నాడు. దీంతో అతను ఏ ప్లస్ కేటగిరీలోనే కొనసాగే అవకాశాలు ఉన్నాయి. ఏ ప్లస్ కాంట్రాక్టు జాబితా ప్లేయర్లకు ఏడు కోట్లు శాలరీ ఇవ్వగా, ఏ కేటగిరీ ఆటగాళ్లకు 5 కోట్లు మాత్రమే ఇస్తారు.

## ఆసియా కప్‌లో భారత్ షెడ్యూల్ ఇదే! పాకిస్తాన్‌తో పోరు ఎప్పుడు?




యూఏఈ వేదికగా డిసెంబర్ 12, 2025(రేపటి) నుంచి అండర్-19 ఆసియా కప్ ప్రారంభం కానుంది. ఈసారి కూడా భారత్, పాకిస్తాన్ మధ్య మరో మహా సమరం జరగనుంది. ఈ టోర్నమెంట్‌లో టీమిండియా షెడ్యూల్ ఏమిటో, దాయాది దేశంతో ఎప్పుడు తలపడుతుందో తెలుసుకుందాం.అండర్-19 ఆసియా కప్ 2025లో భారత్, పాకిస్తాన్ మధ్య హై-వోల్టేజ్ మ్యాచ్ డిసెంబర్ 14, ఆదివారం నాడు జరగనుంది. ఈ ప్రతిష్టాత్మక మ్యాచ్ ఐసీసీ అకాడమీ గ్రౌండ్‌లో నిర్వహించబడుతుంది. సీనియర్ మెన్స్ ఆసియా కప్‌లో భారత్ పాకిస్తాన్‌ను ఫైనల్‌తో సహా 3 సార్లు ఓడించింది. అయితే రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో మాత్రం పాకిస్తాన్ భారత్‌ను ఓడించింది. ఈ అండర్-19 ఆసియా కప్‌లో ఏ జట్టు పైచేయి సాధిస్తుందో కాలమే నిర్ణయిస్తుంది. అండర్-19 ఆసియా కప్‌లో భారత్‌కు ఆయుష్ మాత్రే కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ జట్టులో విధ్వంసకర బ్యాట్స్‌మెన్ వైభవ్ సూర్యవంశీ కూడా భాగమయ్యాడు.టోర్నమెంట్ ప్రారంభం గ్రూప్ దశతో అవుతుంది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్... మలేషియా, యూఏఈలతో కలిసి గ్రూప్ ఎలో ఉన్నాయి. గ్రూప్ ఃలో శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్ జట్లు ఉన్నాయి. ప్రతి జట్టు తమ గ్రూప్‌లోని అన్ని జట్లతో ఒక్కోసారి ఆడుతుంది. ఆ తర్వాత రెండు గ్రూప్‌ల నుండి టాప్ 2 జట్లు సెమీ-ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఈ టోర్నమెంట్ ఫైనల్ డిసెంబర్ 21న జరగనుంది.ఆయుష్ మాత్రే (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్ కుండూ (వికెట్ కీపర్), హర్వంశ్ సింగ్ (వికెట్ కీపర్), యువరాజ్ గోహిల్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్ ఏ. పటేల్, నమన్ పుష్పక్, డి. దీపేష్, హేనిల్ పటేల్, కిషన్ కుమార్ సింగ్, ఉద్ధవ్ మోహన్, ఆరోన్ జార్జ్

## కింగ్ కాదు అంతకు మించి: కోహ్లీ ఫ్యాన్స్‌కు పండగ..పాపం రోహిత్..!!

2025లో వన్డే ఫార్మాట్‌లో భారత బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలిచిన విరాట్ కోహ్లీ, ఈ ఏడాది అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. సంవత్సరం మొత్తం అద్భుతమైన స్థిరత్వాన్ని కనబర్చిన ఈ వెటరన్ బ్యాటర్, 651 పరుగులతో తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. ద్వి-పాక్షిక సిరీస్‌లు, ఛాంపియన్స్ ట్రోఫీ వంటి ఐసీసీ టోర్నమెంట్‌లలో విరాట్ అందించిన మ్యాచ్-డిఫైనింగ్ ఇన్నింగ్స్‌లు...ఆధునిక క్రికెట్‌లో అతను గొప్ప 'ఛేజ్ మాస్టర్'ఎందుకనే విషయాన్ని మరోసారి నిరూపించాయి.కోహ్లీ ఈ ఏడాదిని సఫారీలపై జరిగిన ఆఖరి వన్డే సిరీస్‌లో వరుస సెంచరీలతో ముగించి, ఫైనల్ టచ్ ఇచ్చాడు. ఒత్తిడిలో ప్రశాంతంగా ఆడటం, ఇన్నింగ్స్‌ను పూర్తిస్థాయిలో నడిపించగల అతని సామర్థ్యం 2025లో భారత్‌కు భారీ బలంగా నిలిచింది. కాగా, కేవలం ఒక్క పరుగు తేడాతో కెప్టెన్ రోహిత్ శర్మ (650 పరుగులు) ద్వితీయ స్థానంలో నిలిచాడు. కోహ్లీ ఛేజింగ్‌లలో పట్టు సాధిస్తే, రోహిత్ మాత్రం పవర్‌ప్లే ఓవర్లలో తన విధ్వంసక ఆరంభాలతో ప్రత్యర్థులను వణికించాడు. జాగ్రత్తగా ఆడే విధానం నుంచి దూకుడుగా మారే అతని ప్రత్యేకత... మిడిల్ ఆర్డర్‌కు బలమైన పునాదులు వేయడంలో కీలకమైంది.నాల్గవ స్థానంలో, శ్రేయస్ అయ్యర్ (496 పరుగులు) తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. ఈ ఏడాది భారత్‌కు అత్యంత నమ్మకమైన మిడిల్ ఆర్డర్ ఆప్షన్‌గా అయ్యర్ నిలిచాడు. ముఖ్యంగా ప్రారంభ వికెట్లు త్వరగా పడిపోయినప్పుడు, ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించడంలో మరియు స్ట్రైక్ రొటేట్ చేయడంలో అతని నైపుణ్యం గొప్పగా కనిపించింది.యువ కెప్టెన్ శుభమన్ గిల్ కూడా 490 పరుగులు చేసి, తన వయసుకు మించిన పరిణతిని ప్రదర్శించాడు. గిల్ క్లాసికల్ స్ట్రోక్ ప్లే మరియు కీలక మ్యాచ్‌లలో ప్రశాంతత.. దీర్ఘకాలికంగా భారత జట్టుకు ఒక ఆస్తిగా అతని స్థానాన్ని పటిష్టం చేశాయి.ఇక, వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపడుతూనే, పరిమిత అవకాశాలను సద్వినియోగం చేసుకున్న కేఎల్ రాహుల్ 367 పరుగులు చేశాడు. స్థిరీకరించే పాత్ర నుంచి మ్యాచ్‌ను ముగించే ఫ్లోటింగ్ రోల్స్ వరకు అతని అనుకూలత భారత లైనప్‌కు అదనపు బలాన్ని చేకూర్చింది.ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ (నెం.1), విరాట్ కోహ్లీ (నెం.2) టాప్ 2 స్థానాల్లో కొనసాగడం, అలాగే శుభమన్ గిల్ టాప్ 5లో ఉండటం... వన్డే ఫార్మాట్‌లో భారత బ్యాటింగ్ పటిష్టతకు నిదర్శనం. యువ ఆటగాళ్లు తమ సత్తా చాటుతుండగా, సీనియర్ల స్థిరత్వం భారత క్రికెట్ భవిష్యత్తుకు భరోసానిస్తోంది.



# సినిమా



## బేబమ్మ డ్యాన్స్.. ఇది ఎవరు గుర్తించలేదే..!



ఉప్పెన సినిమాతో తెలుగులో సూపర్ హిట్ అందుకున్న బేబమ్మ అలియాస్ కృతి శెట్టి తెలుగులో వరుస ఫ్లాపులు ఫేస్ చేస్తుండగా కోలీవుడ్ లో మాత్రం అమ్మడికి మంచి అవకాశాలు వస్తున్నాయి. కోలీవుడ్ స్టార్ కార్తితో వా వాతియార్ సినిమా చేసింది కృతి శెట్టి. ఈ సినిమాను తెలుగులో అన్నగారు వస్తారు టైటిల్ తో రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా ఈవెంట్ లో కార్తి కృతి శెట్టిపై చేసిన కామెంట్స్ వైరల్ అయ్యాయి. కృతి శెట్టి తొలి సినిమా ఉప్పెన నుంచి ఇప్పటివరకు తెలుగులో 10 సినిమాల దాకా చేయగా అమ్మడిలో ఉన్న స్పెషల్ టాలెంట్ ని మన మేకర్స్ గుర్తించలేదు. కృతి శెట్టిలోని ఆ టాలెంట్.. కార్తి మాత్రం కృతి శెట్టిలోని ఆ టాలెంట్ గుర్తించాడు. ఈవెంట్ లో మాట్లాడుతూ కృతి శెట్టి డ్యాన్స్ బాగా చేస్తుందని. తనతో మాత్రం సెకండ్ మీటర్ లో చేయి మిగతా 3, 4 ఇంటి దగ్గర పెట్టిరా అని చెప్పానని సరదాగా మాట్లాడారు కార్తి. కృతి శెట్టి యాక్టింగ్ గురించి అందరు చెప్పారు కానీ ఆమె డ్యాన్స్ గురించి ఎవరు ఇప్పటివరకు ఇలా చెప్పలేదు. అందరు అమ్మడి రోల్స్ మీద రొటీన్ అంటూ కామెంట్ చేయడమే కానీ ఆమెలోని ఈ డ్యాన్స్ టాలెంట్ ని ఎంకరేజ్ చేయట్లేదు. కనీసం కృతి శెట్టి డ్యాన్స్ గురించి ఎవరు ఇప్పటివరకు ప్రస్తావించిన సందర్భాలు లేవు. కానీ కార్తి స్పెసిఫిక్ గా కృతి శెట్టి డ్యాన్స్ గురించి చెప్పడంతో అందరు కృతిలోని ఈ టాలెంట్ ని మన వాళ్లు ఎందుకు వాడుకోలేదని అంటున్నారు. కృతి శెట్టి కోలీవుడ్ ప్రయత్నాలు ఒకదానికి మించి మరొకటి అనేలా ఉన్నాయి. వా వాతియార్ తో పాటు రవి మోహన్ తో జీనీ, ప్రదీప్ రంగనాథన్ తో ఎల్.ఐ.కె చేస్తుంది కృతి శెట్టి. డ్యాన్స్ ప్రధానంగా కృతికి అవకాశాలు..అన్నగారు వస్తారు సినిమాతో మరోసారి తెలుగు ఆడియన్స్ ముందుకు వస్తుంది కృతి శెట్టి. మరి కార్తి చెప్పినట్టుగా ఆమె డ్యాన్స్ పెర్ఫార్మెన్స్ బాగుంటే మాత్రం తెలుగులో డ్యాన్స్ ప్రధానంగా అయినా కృతికి అవకాశాలు ఇస్తారేమో చూడాలి. కృతి శెట్టి కూడా తెలుగులో మళ్లీ బిజీ అవ్వాలని తెగ ప్రయత్నాలు చేస్తుంది. ఉప్పెన సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న కృతి శెట్టి ఆ తర్వాత వరుస ఆఫర్లు అందుకుంది. ఐతే ఆ టైంలో అన్ని వర్క్ అవుట్ అవుతాయనే ఉద్దేశ్యంతోనే కృతి శెట్టి ఆ సినిమాలు చేసింది. ఐతే బ్యాడ్ లక్ వల్ల సినిమాలన్నీ వరుసగా నిరాశ పరుస్తూ వచ్చాయి. ఐతే కోలీవుడ్ లో మాత్రం ఈసారి పకడ్బందీ ప్లానింగ్ తో వెళ్తుంది కృతి శెట్టి. కార్తి సినిమా హిట్ పడితే అక్కడ బోణీ తెరిచినట్టే. ఇక ప్రదీప్ లాంటి యూత్ హీరోతో నటించడం తో తమిళ్ లో ఆమెకు మరిన్ని ఛాన్స్ లు వస్తాయని చెప్పొచ్చు.

## రోషన్ 'మోగ్లీ'.. సెన్సార్ అలా ఇచ్చిందేంటి?

ప్రముఖ యాంకర్ సుమ కొడుకు రోషన్ కనకాల లీడ్ రోల్ లో రెండో సినిమాగా మోగ్లీ రూపొందిన విషయం తెలిసిందే. కలర్ ఫోటో మూవీతో నేషనల్ అవార్డు అందుకుని అందరి దృష్టిని ఆకర్షించిన సందీప్ రాజ్ దర్శకత్వం వహించిన ఆ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. విభిన్న అంశంతో రూపొందిన మోగ్లీ మూవీ డిసెంబర్ 12వ తేదీన రిలీజ్ చేస్తున్నట్లు కొద్ది రోజుల క్రితం మేకర్స్ అనౌన్స్ చేశారు. అంతకుముందే ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టారు. టీజర్, ట్రైలర్ సహా పలు ప్రమోషనల్ కంటెంట్ ను విడుదల చేసి ఆడియన్స్ లో మోగ్లీ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశారని చెప్పాలి. అయితే డిసెంబర్ 12న బాలయ్య అఖండ 2: తాండవం మూవీ.. ప్రేక్షకుల ముందుకు రాబోతుండడంతో మోగ్లీ వాయిదా పడింది. డిసెంబర్ 13వ తేదీన థియేటర్స్ లో విడుదల కానుంది. ఈ మేరకు ఇప్పటికే సోషల్ మీడియాలో కొత్త పోస్టర్ తో ప్రకటించిన మేకర్స్.. తాజాగా సెన్సార్ ఫార్మాలిటీస్ ను పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు మేకర్స్ అనౌన్స్ చేయకపోయినా.. సోషల్ మీడియాలో సెన్సార్ సర్టిఫికెట్ వైరల్ గా మారింది. 160 నిమిషాల రన్ టైమ్ తో మోగ్లీ మూవీ ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు అందులో పొందుపరిచి ఉంది. అంతే కాదు.. మోగ్లీ మూవీ ఫైనల్ కాపీని చూసిన సెన్సార్ బోర్డు అధికారులు.. సినిమాకు ఏ సర్టిఫికెట్ ఇవ్వడం గమనార్హం. ఎందుకంటే ఇప్పటి వరకు మేకర్స్ రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ లో ఎలాంటి సెన్సిటివ్ కంటెంట్ ఎక్కడా కనిపించలేదు. టీజర్, ట్రైలర్ లో



కూడా అలా ఏం లేదు. కానీ సెన్సార్ అధికారులు మాత్రం ఏ సర్టిఫికెట్ ఇచ్చారు. నిజానికి మూవీలో హింస, లైంగిక సన్నివేశాలు, అసభ్యకరమైన భాష వంటి అంశాలు ఉంటే ఏ సర్టిఫికెట్ ఇస్తుంటారు. సినిమాలు టీవీలో ప్రసారం కావడానికి ముందు కొన్ని సీన్స్ ట్రిమ్ చేయాలని చెబుతారు. సినిమాను 18 సంవత్సరాలు నిండిన వారు మాత్రమే చూడాలని చెబుతారు. అయితే ఇప్పుడు మోగ్లీకి ఏ సర్టిఫికెట్ రావడం చర్చనీయాంశంగా మారింది. టీజర్, ట్రైలర్ లో సెన్సిటివ్ పాయింట్స్ లేకపోవడంతో అంతా డిస్కస్ చేసుకుంటున్నారు. కానీ అధికారులు జారీ చేయడంలో సినిమాలో సెన్సిటివ్ పాయింట్స్ ఉండవచ్చేమో. మరి సినిమా రిలీజ్ అయితే కానీ తెలియదు కదా.. వేచి చూడాలి.



## ఘన స్వాగతం.. జీవితంలో మర్చిపోలేని రోజు..!



టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో నటిగా మంచి పేరు తెచ్చుకున్న ప్రగతి.. ప్రస్తుతం ఇండియాకి ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించి పెట్టింది. తాజాగా జరిగిన ఏషియన్ ఓపెన్ అండ్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2025 పోటీల్లో పాల్గొని.. ఏకంగా నాలుగు పతకాలు అందుకుంది. ఇక ప్రగతి తన విజయాన్ని సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంటూ తెగ సంబరపడిపోతోంది. అంతేకాదు ప్రగతి ఇండియాకి రావడంతో.. చాలామంది ఆమె సన్నిహితులు, కుటుంబ సభ్యులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఇందుకు సంబంధించిన వీడియోను కూడా ప్రగతి తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. ఈ వీడియోలో ప్రగతి జాతీయ జెండాను పట్టుకొని తెగ సంబరపడిపోతోంది. అలాగే ఆమె చుట్టూ ఉన్నవాళ్లు ఆమెపై పువ్వులు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. అంతేకాకుండా పాటలకు స్టెప్పులు వేస్తూ మెడలో పతకాలు వేసుకొని తెగ మురిసిపోయింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. అయితే ఈ వీడియోకి " నా జీవితంలో నిజమైన విజయం ఏమిటంటే.. నన్ను ప్రేమించే వారు.. నా పట్ల గర్వపడేవారు.. నా జీవితంలో.. నా ప్రతి అడుగులోనూ నాతో ఉన్నవారు.నా విజయాన్ని సెలెబ్రేట్ చేసుకునేవారు.. నేను విజయం సాధించి ఇంటికి వచ్చినప్పుడు నాకు లభించే స్వాగతం ఇది.. నా జీవితంలో మర్చిపోలేని రోజుగా మిగిలిపోయింది" అంటూ ప్రగతి పెట్టిన క్యాప్షన్ ప్రస్తుతం వైరల్ గా మారింది. అంతేకాకుండా చాలామంది ప్రగతి సాధించిన విజయాలను చూసి గర్వపడడమే కాకుండా ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని కోరుకుంటున్నారు. ప్రగతి అంటే సినిమాల్లో హోమ్లీ పాత్రలు చేసుకునే నటి అని అందరూ అనుకున్నారు. కానీ ప్రగతిలో ఉన్న ఈ టాలెంట్ ఎవరికి తెలియదు. అలా గత రెండు మూడు సంవత్సరాలు నుండి వెయిట్ లిఫ్టింగ్ చేస్తూ పలు పోటీలలో పాల్గొని గోల్డ్, సిల్వర్ మెడల్స్ ను అందుకుంది.అలా తాజాగా జరిగిన ఏషియన్ ఓపెన్ అండ్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2025 లో కూడా పాల్గొని డెడ్ లిఫ్ట్ విభాగంలో గోల్డ్ మెడల్, స్క్వాట్, బెంచ్ ప్రెస్ రెండు విభాగాల్లో సిల్వర్ మెడల్ అందుకుంది. ఇక ఓవరాల్ గా సిల్వర్ మెడల్ గెలుచుకున్నట్టు ప్రగతి చెప్పుకొచ్చింది. అలా నాలుగు మెడల్స్ సాధించి భారతదేశానికి గొప్ప పేరు తీసుకు వచ్చింది. ప్రగతి కెరియర్ విషయానికి వస్తే.. నెల్లూరు జిల్లాలోని ఉలవపాడులో జన్మించిన ప్రగతి.. సినిమాల్లోకి రావాలని అనుకోలేదు. ఆ తర్వాత కాలేజీ డేస్ లో మోడలింగ్ లోకి ఎంట్రీ ఇచ్చి ఓ యాడ్ లో నటించింది. ఆ తర్వాత ఎంట్రీ ఇచ్చింది.. అలా కెరీర్ మొదలుపెట్టిన ప్రగతి ఆ తర్వాత తెలుగు, తమిళ,మలయాళ సినిమాల్లో తల్లిగా.. అత్తగా.. అక్కగా.. వదినగా.. ఇలా ఎన్నో పాత్రలు పోషించింది.


## అవతార్-3.. ఇండియాలో అన్ని కోట్లు రాబడుతుందా?

ప్రపంచంలోనే అత్యధికంగా రెస్పాన్స్ అందుకున్న సినిమా ఫ్రాంఛైజీల్లో కచ్చితంగా అవతార్ టాప్ లో ఉంటుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. ఇప్పటి వరకు రెండు పార్టులు రాగా.. ఇప్పుడు మూడో భాగం అవతార్: ఫైర్ అండ్ యాష్ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. డిసెంబర్ 19వ తేదీన గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఇప్పటికే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మూవీ లవర్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టికెట్ బుకింగ్ ప్లాట్ ఫామ్ బుక్ మై షోలో 1.2 మిలియన్ల ఇంట్రెస్టులు నమోదవడంతో ఎంతటి ఆసక్తి ఉందో స్పష్టంగా అర్థమవుతుంది. హాలీవుడ్ మూవీనే అయినా.. ఇండియాలో పెద్ద సంఖ్యలో అభిమానులు సినిమా కోసం వెయిట్ చేస్తున్నారు.అవతార్: ఫైర్ అండ్ యాష్ కోసం ఈసారి కొత్త తెగను డైరెక్టర్ జేమ్స్ కామరూన్ క్రియేట్ చేయడం విశేషం. దాంతోపాటు మూవీని భారీ స్థాయిలో రూపొందించడంతో పెద్ద ఎత్తున ఖర్చు అయినట్టు తెలుస్తోంది. ఆర్టిస్టులు, టెక్నిషియన్ రెమ్యునరేషన్ లతోపాటు నిర్మాణ ఖర్చు అంతా కలిసి సుమారు 400 మిలియన్ డాలర్స్ అయిందట. అంటే మన కరెన్సీలో 3600 కోట్ల రూపాయల బడ్జెట్ తో సినిమాను రూపొందించినట్లు తెలుస్తోంది.



## చాలాకాలం తర్వాత... వీక్ డేస్ లో స్ట్రాంగ్

రన్వీర్ సింగ్ హీరోగా నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ దురంధర్ సినిమా గతవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. భారీ బడ్జెట్ తో, భారీ స్టార్ కాస్టింగ్ తో రూపొందిన దురంధర్ సినిమా బాక్సాఫీస్ వద్ద ఒక మోస్తరు ఓపెనింగ్స్ రాబడుతుందని అంతా భావించారు. ఈ మధ్యకాలంలో వచ్చిన బాలీవుడ్ సినిమాల మాదిరిగానే ఈ సినిమా గొప్పగా ఏమీ లేదు అంటూ చాలామంది విమర్శలు చేశారు. సినిమాకు నిడివి ఎక్కువ ఉండడం ఒక మైనస్ అయితే యాక్షన్ సన్నివేశాలు ఎక్కువగా ఉండడం మరో మైనస్ అంటూ రివ్యూ లు చెప్పిన వారు చాలామంది కామెంట్స్ చేశారు. కానీ ప్రేక్షకులు మాత్రం సినిమాకు బ్రహ్మరథం పడుతున్నారు అని నమోదు అవుతున్న కలెక్షన్స్ ని బట్టి చెప్పుకోవచ్చు. మొదటి రోజు కాస్త నీరసంగా నిరుత్సాహంగా అనిపించిన కలెక్షన్స్ రోజులు గడుస్తున్న కొద్ది భారీగా పెరుగుతూ పోతున్నాయి. సాధారణంగా వీక్ డేస్ లో కలెక్షన్స్ ఒక మోస్తరుగా నమోదు అయితే గొప్ప విషయం అంటారు కానీ ఈ సినిమాకు వీక్ డేస్ లో సాలిడ్ కలెక్షన్స్ నమోదు అవుతున్నట్లుగా బాక్సాఫీస్ వర్గాల వారు చెబుతున్నారు. బుక్ మై షో నెంబర్స్ చూస్తుంటే ఆశ్చర్యంగా ఉందని స్వయంగా చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. దురంధర్ కలెక్షన్స్... భారీ స్టార్ కాస్టింగ్, సినిమా గురించి పాజిటివ్ పబ్లిసిటీ కారణంగా శుక్రవారం మొదటిరోజు కావడంతో బుక్ మై షో లో దాదాపుగా 3.76 లక్షల టికెట్లు అమ్ముడు పోయాయి. ఇక రెండవ రోజు వీకెండ్ కావడంతో శనివారం 4.62 లక్షల టికెట్లు అమ్ముడు పోవడం విశేషం. మొదటి రెండు రోజులకే సినిమా రూ.100 కోట్ల కలెక్షన్స్ కి చేరువ కావడంతో యూనిట్ సభ్యులు ప్రమోషన్ కార్యక్రమాలను పెంచారు. మూడవ రోజు అయిన ఆదివారం దాదాపుగా 5 లక్షల టికెట్లు బుక్ అయ్యాయి. ఆదివారం కలెక్షన్స్ తో కలుపుకొని దురంధర్ సినిమా రూ.100 కోట్ల మార్కుని క్రాస్ చేసింది. ఈ సంవత్సరం రూ.100 కోట్లు అంతకు మించి కలెక్షన్స్ రాబట్టడం పెద్ద సినిమాలకు కూడా కష్టంగా మారింది. ఇలాంటి సమయంలో మొదటి మూడు రోజుల్లోనే రూ.100 కోట్ల రూపాయల కలెక్షన్స్ నమోదు చేయడంతో ఈ సినిమా గురించి ప్రముఖంగా చర్చ జరిగింది. అంతేకాకుండా పాకిస్తాన్లో ఇండియన్ స్పై ఏజెంట్ నిర్వహించిన పై ఆపరేషన్ గురించి ప్రముఖంగా కథనాలు వినిపిస్తున్నాయి. నిజ జీవిత పాత్రలను సినిమాలో చూపించడం ద్వారా కూడా ప్రముఖంగా చర్చ జరిగే విధంగా దర్శకుడు ఆదిత్య దర్ చేశాడు. బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ మొదటి మూడు రోజుల్లోనే రూ.100 కోట్ల రూపాయలకు పైగా కలెక్షన్స్ రాబట్టిన దురంధర్ సినిమా వీక్ డేస్ లో ఎలాంటి కలెక్షన్స్ రాబడుతుందా అని అంత ఆసక్తిగా ఎదురు చూశారు. సోమవారం అంతా అనుకున్నట్లుగానే కాస్త కలెక్షన్స్ తగ్గాయి, సోమవారం సినిమా చూసేందుకు బుక్ మై షో లో దాదాపుగా 3.75 లక్షల మంది టికెట్లు బుక్ చేసుకున్నారు. సాధారణంగా అయితే తర్వాత రోజు అంటే మంగళవారం బుకింగ్ మరింతగా తగ్గాలి, కలెక్షన్స్ నెంబర్స్ సోమవారంతో పోలిస్తే మరింతగా తగ్గాలి. కానీ ఆశ్చర్యకరంగా సోమవారంతో పోలిస్తే దాదాపుగా 35,000 మంది అదనంగా సినిమాలు చూసేందుకు బుక్ మై షో ద్వారా టికెట్స్ ని బుక్ చేసుకోవడం జరిగింది. 4.10 లక్షల మంది బుక్ మై షో ద్వారా టికెట్ బుక్ చేసుకుని సినిమాను చూసినట్లుగా రికార్డు నమోదయింది. ఈ మధ్యకాలంలో వీక్ డేస్ లో ఈ స్థాయి బుకింగ్స్ నమోదు కాలేదని బాక్సాఫీస్ వర్గాల వారు కామెంట్ చేస్తున్నారు. వీకెండ్ నెంబర్ తో పోలిస్తే వీక్ డేస్ నెంబర్స్ ఎక్కువగా నమోదు కావడం కచ్చితంగా సినిమాకి దక్కిన హిట్ టాక్ కారణం అంటున్నారు. ఇండియన్ ఆర్మీ వర్సెస్ పాకిస్తాన్ భారత స్పై ఏజెంట్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమాను చూపించారు అంటూ మొదటి నుండి వార్తలు వస్తున్నాయి.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**